www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

శనివారం | 12-10-2024 | పేజీలు: 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 194 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | అనంతపురము సిటీ

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జయమంగళికి జలకళ

పరిగి, అక్టోబరు 11: ఎగువన కర్ణాటకలో భారీ వర్షాలు కురవడంతో శుక్రవారం జయమంగళి నది జలకళను సంతరించుకుంది. మండలంలోని శ్రీరంగరాజులపల్లి వద్ద జిల్లాలోకి వరద ప్రవేశించడంతో పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి, వీక్షించారు. ఈ వరద నీరు పరిగి చెరువులోకి చేరాల్సి ఉంది. ఆకతాయిలు మరోచోటికి మళ్లించడంతో చెరువుకు చేరలేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పరిగి వాసులు కోరుతున్నారు.



జయమంగళి నదిలో నీటి ప్రవాహం

దిగ్విజయీభవ..

నేడు విజయదశమి..

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

పుట్టపర్తి, అక్టోబరు 11: విజయాలను ప్రసాదించే దసరా పండుగను శనివారం నిర్వహించుకోనున్నారు. అమ్మవారిని తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. విజయదశమి రోజున పండుగ చేసుకోవడం ఆనవాయితీ. దసరా వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించారు. విజయ దశమి నేపథ్యంలో కొత్త దుస్తులు, పూజాసామగ్రి, పూల కొనుగోలుకు జనం ఎగబడ్డారు. దీంతో దుకాణాలు, మార్కెట్లు కిక్కిరిసిపోయాయి. విజయదశమి నేపథ్యంలో అమ్మవారి ఆలయాలను విశేషంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి జనం పోటెత్తనున్నారు. ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి.



హిందూపురంలో భగవతీదేవి అలంకారంలో వాసవీమాత



వెంకటేశ్వర స్వామి అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

వైకుంఠవాసిగా ఖాద్రీశుడు

కదిరి, అక్టోబరు 11: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీశుడు శుక్రవారం వెంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకైంకర్యాల అనంతరం వెంకటేశ్వరస్వామి అలంకారంలో కొలువుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

డీపీఓలో ఘనంగా ఆయుధపూజ

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 11: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, మోటారు వాహనాలకు ఎస్పీ రత్న ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, పోలీసులు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శివనారాయణస్వామి, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



పోలీసు వాహనాలకు పూజ చేస్తున్న ఎస్పీ రత్న

లేపాక్షిలో తోలుబొమ్మలాట

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

లేపాక్షి, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక దుర్గావీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో తోలుబొమ్మలాట నిర్వహించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. తోలుబొమ్మలాట, సంగీతం, నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమానికి కలెక్టర్ చేతన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



తోలుబొమ్మలాటను తిలకిస్తున్న కలెక్టర్

మహిళ హత్యకేసు ఛేదింపు

నిందితుడి అరెస్టు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 11: అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామ సమీపాన తోటలో ఇటీవల జరిగిన మహిళ హత్యకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడుని అరెస్టు చేశారు. కేసు వివరాలను ఎస్పీ రత్న శుక్రవారం డీపీఓలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వెల్లడించారు. పెనుకొండ పట్టణానికి చెందిన బోయ రామలక్ష్మి భర్త నాగభూషణం ఇదివరకే మరణించాడు. రామలక్ష్మి అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపాన ఏఎస్‌ఐ కృష్ణమూర్తికి చెందిన మామిడితోటలో తోటమాలిగా పనిచేస్తుండేది. అంతకుమునుపు అదేతోటలో పనిచేస్తున్న ఓబుళదేవరచెరువు మండలం వేమారెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు పనిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో తనను పని మాన్పించి, రామలక్ష్మి చేరిందని ఆంజనేయులు కక్ష పెంచుకున్నాడు. ఆమెను కడతేర్చాలని అదును కోసం వేచిచూస్తుండేవాడు. ఈనెల 6వ తేదీన ఆంజనేయులుకు రామలక్ష్మి ఫోన్ చేసి, మద్యం తాగాలని ఉందనీ, తీసుకురావాలని చెప్పింది. ఇదే అదునుగా భావించిన ఆంజనేయులు మద్యం తీసుకుని, తోటకెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో రామలక్ష్మిపై ఆంజనేయులు దాడి చేశాడు. విచక్షణారహితంగా దాడి చేశాడు. మళ్లీ ఇద్దరూ కలిసి మద్యం తాగేందుకు ఉపక్రమించారు. మద్యంలో నీళ్లు కలపాలని ఆంజనేయులు చెప్పాడు. దీంతో రామలక్ష్మి నీళ్లకు బదులు మూత్రం కలపడాన్ని చూసి ఆంజనేయులు తీవ్రస్థాయిలో గొడవపడ్డాడు. పారతో ఆమె నుదురు, ముక్కుపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను రేకులషెడ్డులోని మంచం వేసి, చంపేశాడు. దీనిపై రామలక్ష్మి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఆంజనేయులును అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించడంలో చొరవ చూపిన సీఐ సునీత, ఎస్‌ఐ వెంకటనారాయణ, కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, సూర్యనారాయణ, జబీవుల్లా, రవిని ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు విజయ్‌కుమార్, శివనారాయణ, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.


BLUE HORIZON
విజయదశమి శుభాకాంక్షలతో
18న విడుదల
A PRAVEEN JETTI Film
కల్లుకాంపౌండ్
-1995-
STORY, SCREENPLAY, DIRECTION
PRAVEEN JETTI
PRODUCERS
Smt HARIKA JETTI, BURRA MALLESH GOUD (BOTTU), Smt PITLA VIJAYA LAKSHMI
DOP ARE SANDEEP MUSIC SAI SRINIVAS EDITING PANDU
DANCE KARIA NANDA, MAHESH FIGHTS VIOLENT VELU
SUCHIN CINEMAS LLP


A FILM BY
KALYAN CHAKRAVARTHY
దసరా శుభాకాంక్షలు
FROM TEAM REWIND
IN THEATERS
OCTOBER
18
రివైండ్
SCREENPLAY, DIALOGUES, PRODUCER & DIRECTOR KALYAN CHAKRAVARTHY
MUSIC ASHIRVAD DOP SHIVARAM CHARAN ACTION DIRECTOR NATRAJ CHOREOGRAPHY RAJ KRISHNA STORY BHARAT CHOUDARY
LYRICS RAVI VARMA AKULA EDITOR THUSHARA PALA SFX ETHIRAJ FINAL MIX RAMA NAIDU STUDIOS DI RAJU REDDY PRO MADHU


DARK
HISTORY LEADS TO
DEADLY
MYSTERY
OCT 18TH RELEASING IN THEATERS
దసరా
శుభాకాంక్షలు
వీక్షణం
THE OBSERVER IS OBSERVED
ADITYA MUSIC


SUBISHI ENTERTAINMENTS
ASIAN SURESH ENTERTAINMENT LLP
దసరా
శుభాకాంక్షలు
లగ్గం
THE CRAZIEST WEDDING EVER
WRITTEN & DIRECTED BY
RAMESH CHEPPALA
PRODUCED BY
VENUGOPAL REDDY
WORLDWIDE RELEASE
OCTOBER
25
IN THEATERS
MN BAL REDDY
MANISHARMA
CHARAN ARJUN
BONTHALA NAGESWARA REDDY
KRISHNA ARTS
G. KRISHNNA
SRIDHAR
AJAY SIVA SANKAR
VIVAREDDY POSTERS
ADITYA MUSIC


SMT. CHINTA VARALAXMI PRESENTS
KA PRODUCTIONS
దసరా
శుభాకాంక్షలు
SCAN THE QR CODE
TO WATCH TEASER
KIRAN ABBAVARAM
క


SVM
SRI VEDAKSHARA MOVIES
విజయ దశమి శుభాకాంక్షలు
RANGAPURAM RAGHAVENDRA
MURALI KRISHNA CHINTALAPATI
PRESENTS
COMING SOON
శ్రీ శ్రీ శ్రీ
రాజావారు
WRITTEN & DIRECTED BY VEGESNA SATISH
PRODUCED BY CHINTHAPALLI RAMARAO (SE)


దసరా
శుభాకాంక్షలు
హంతకుడు
THE DESTROYER
DR. LAKSHMANA RAO DIGGALA, DR. PRAVEEN REDDY


GUNA HANDMADE FILMS
SMT. RAGINI GUNA PRESENTS
EARLY 2025
euphoria
A GUNASEKHAR FILM
SCAN FOR
GLIMPSE
దసరా
శుభాకాంక్షలు
PRODUCED BY NEELIMA GUNA
KAALA BHAIRAVA PRAVEEN K POTHAN


people MEDIA FACTORY
CHITRALAYAM
DONEPUDI CHAKRAPANI PRESENTS
మన కుటుంబం మొత్తం 'విశ్వం'
చిత్రం చూస్తూ కడుపుబ్బా నవ్వుతూ సంతోషంగా
"దసరా" పండగ చేసుకుందాం
ALL INDIA RELEASE BY
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
MACHO STAR GOPICHAND IN
విశ్వం
A SREENU VAITLA FILM
T G VISHWA PRASAD VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA KONDAL JINNA KRITHI PRASAD K.V. GUHAN
CHAITAN BHARADWAJ GOPI MOHAN BHANU - NANDU PRAVEEN VARMA AMAR REDDY KUDUMULA KIRAN KUMAR MANNE
RAVI VERMA KOLLI SUJITH KUMAR ADITYA CHEMBOLU KONGARAPI RAMBABU VAMSI SHEKAR
TIPS TELUGU



ధర్మవరంలో పూలు, పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు





దసరా సందడి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : పుట్టపర్తి, ధర్మవరం, కదిరి పట్టణాల్లోనే కాక.. మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం దసరా పండుగ సందడి కనిపిస్తోంది. విజయదశమిని పురస్కరించుకుని శుక్రవారం పండుగ సరుకుల కొనుగోళ్లు, ప్రజల షాపింగ్‌లతో దుకాణాలు కిటకిటలాడాయి. పూలు, పండ్లు, మావిడాకులు, టెంకాయలు, అరటి పిలకలు తదితర సామగ్రి కొనుగోళ్ల నేపథ్యంలో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. కాగా శుక్రవారం ఉదయం ఆయుధపూజ సందర్భంగా వాహనాలు, యంత్రాలతో పాటు వ్యవసాయ పరికరాలకూ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. విజయదశమి నేపథ్యంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు.





ధర్మవరంలో లక్ష్మీచౌడేశ్వరీదేవి, వెంకటేశ్వరస్వామికి అలంకరణ



కదిరిలో చౌడేశ్వరీదేవి







పుట్టపర్తిలో గంగాభవాని, సత్యమ్మ, లలితాంబ అమ్మవార్ల అలంకరణ



ప్రత్యేక అలంకరణలో మహాసమాధి

పుట్టపర్తిలో కొనసాగిన యజ్ఞం

పుట్టపర్తి, అక్టోబరు 11 : విశ్వశాంతి కోసం ప్రశాంతి నిలయంలో చేపట్టిన యజ్ఞం శుక్రవారానికి ఆరోరోజుకు చేరింది. ఉదయం 7 గంటలకు పూర్ణచంద్రహాల్‌లో వేదపండితులు మొదట వినాయకుని పూజతో ఈ యజ్ఞాన్ని ప్రారంభించి.. సర్వదేవతా అర్చనతో కొనసాగించారు. సాయంత్రం సాయికుల్వంతు సభామంఠపంలో సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బెంగళూరు బృందావన్ క్యాంపస్ విద్యార్థులు సంగీతగాన కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

కొనసాగిన నిరసన

ధర్మవరం, అక్టోబరు 11 : పనిభారాన్ని తగ్గించాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ముస్తాఫా, కోశాధికారి బాబు, ఉద్యోగులు తిరమలేశ, నజీర్ పాల్గొన్నారు.

నేడు ఉరుసు

నంబులపూలకుంట, అక్టోబరు 11 : మండలంలోని వెలిచెలమలో చిన్నకుళ్లాయ్యస్వామి ఉరుసును శనివారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం ఉదయం కుళ్లాయ్యస్వామి ఉరిమేరవన, సాయంత్రం గంధమహోత్సవం, ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండం, అనంతరం ఉరిమేరవన ఉంటుందన్నారు.



అలంకరణలో పీరు

రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు

కొత్తచెరువు, అక్టోబరు 11 : స్థానిక పెనుకొండ రోడ్డు పక్కన సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం నుంచి నవంబరు 10వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జనతాసొసైటీ సొసైటి అధ్యక్షుడు అరుణ్ ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. ధర్మవరం ప్రాంతానికి చెందిన ఆదిగురు యోగా అసోషియేషన్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఈ తరగతులు ఉంటాయని, ఆసక్తిగల వారు 94901 08511 వాట్సాప్ నెంబర్‌కు పేరు, వయస్సు, చిరునామా పంపాలని సూచించారు.

నేడు పెద్దమ్మ గ్రామోత్సవం

కొత్తచెరువు, అక్టోబరు 11 : విజయదశమి సందర్భంగా పెద్దమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో శనివారం ఊరేగిస్తున్నట్లు ఆలయ పూజారి పెద్దన్న తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఈ గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

పట్టణ పరిశుభ్రతే లక్ష్యం



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో శుభ్రం చేయిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం, అక్టోబరు 11 : ధర్మవరం మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడ రోడ్లపై చెత్త ఉండరాదని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త వాహనాలలోనే వ్యర్థాల ను వేయాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

బత్తలపల్లి అక్టోబరు 11 : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి సతీష్, వీరనారప్ప, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున, రామచంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

రిటైర్డ్ శాస్త్రవేత్త మృతి

కదిరి, అక్టోబరు 11: పట్టణంలోని వేరుశనగ పరిశోధన స్థానంలో ప్రధా న శాస్త్రవేత్తగా విధులు నిర్వహించి.. ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ జె రామచంద్రారెడ్డి (84) శుక్రవా రం మరణించాడు. అతని హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో విధుల్లో చేరారు. తరువాత బాపట్ల, కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేశారు 2000లో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉద్యోగ విరమణ పొందారు. ఇతను అనారోగ్యంతో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో మరణించాడు. ఆయన స్వగ్రామం తాడిపత్రి మండలంలోని నెట్టూరుపల్లి.



రామచంద్రారెడ్డి (ఫైల్)

నేడు దసరా ఉత్సవాలు

పుట్టపర్తి, అక్టోబరు 11 : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శనివారం శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం క్రాస్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డాడు. ముదిగుబ్బకు చెందిన రోగులను 108 వాహనంలో డ్రైవర్ బాల ఓబులేసు, ఈఎంటీ రవికుమార్ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి ముదిగుబ్బకు బయలుదేరారు. టైర్ పంచర్ కావ డంతో మండలంలోని తంబాపురం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని.. వెనుకవైపు నుంచి వీరి వా హనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయ పడ్డ బాల ఓబులేసు, రవికుమార్‌ను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ సోమశేఖర్ ఆ ఆసుపత్రికి వెళ్లి.. ప్రమాదంపై ఆరాతీశారు.

కిక్కె వరికో..!

- పట్టణాల్లో పక్కా సిండికేట్
- మండల కేంద్రాల్లో పోటాపోటీ
- హిందూపురం, కదిరి, ధర్మవరంలో ఒత్తిళ్ల ప్రభావం
- 22 దుకాణాలకు 208 దరఖాస్తులే..
- చాలా షాపులకు సింగిల్ డిజిటే..
- ముగిసిన ప్రక్రియ
- 14న లాటరీ

పుట్టపర్తి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల్లో సిండికేట్ హవా నడిచింది. మద్యం దుకాణాల దురఖాస్తుల్లో ఎమ్మెల్యేలు, బంధువులు, కూటమి నేతల జోక్యం ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని సీఎం చంద్రబాబు స్పష్టంచేసినా సరే జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ఏమాత్రం తగ్గలేదని స్పష్టమైంది. జిల్లాలో 87 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు 1460 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ శాఖ కనీసం 2 వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని ఆశించినా.. నెరవేరలేదు. పలు నియోజకవర్గాల్లో అధికార కూటమిలోని నేతల ఒత్తిళ్ల, బెదిరింపులతో ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తుల్లోనే వెనక్కి జంకాల్సివచ్చింది. ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎవ్వరైనా, ఎక్కడి నుంచైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయినా.. తమ ప్రాంతంలో తమవారే దరఖాస్తులు చేసుకుంటారనీ, ఇతరులెవరూ పోటీకి రాకూడదని బెదిరింపు హెచ్చరికలు వచ్చాయి. దరఖాస్తు చేస్తే దుకాణం పెట్టనివ్వమనీ, ఎలా వ్యాపారం చేస్తారో చూస్తామంటూ కొందరు ప్రజాప్రతినిధుల అనుచరగణం హెచ్చరించింది. దరఖాస్తు గడువు రెండు రోజులు పొడిగించినా పట్నం ప్రాంతాల్లో చాలా దుకాణాలకు సింగిల్ డిజిటే నమోదైంది. దీనిని బట్టి చూస్తే ఏమేరకు ఒత్తిళ్ల, బెదిరింపులకు పాల్పడ్డారో స్పష్టమవుతోంది. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అధికార కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన నేతలు దరఖాస్తుల్లోనే సిండికేట్‌గా ఏర్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకాణాలకు ఇతరులు దరఖాస్తు చేయకుండా అడ్డుకోవడంలో సక్సెస్ అయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలకు పోటీపడినా పట్టణ ప్రాంతాల్లో మాత్రం సిండికేట్‌తో దరఖాస్తులు చేసినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ నేతల బెదిరింపులతో దరఖాస్తులు తక్కువగా వచ్చాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. లాటరీ ద్వారా దుకాణం దక్కించుకున్నా వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామంటూ బెదింపులతో కొందరు వెనకడుగు వేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉండడంతో కొందరు గోప్యంగా వేశారు. ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారో తెలుసుకునే అవకాశం లేకపోవడంతో నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

పక్కా సిండికేట్

జిల్లాలో వాణిజ్య కేంద్రంగా పేరొందిన హిందూపురం పట్టణంలో ఆరు దుకాణాలకు 48 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక్కడ అధికార కూటమి నేతలతోపాటు వైసీపీకి చెందిన నలుగురు నేతలు కలిసి సిండికేట్‌గా ఏర్పడి, దరఖాస్తులు చేసేలా పక్కా ప్రణాళికతో వెళ్లారు. తమ నియోజకవర్గంలో తమను కాదని దరఖాస్తు చేస్తే వ్యాపారం నిర్వహించలేరని హెచ్చరించారు. దీంతో జనాభా పరంగా జిల్లాలో అగ్రస్థానంలో ఉన్న హిందూపురంలో అతితక్కువ దరఖాస్తులు వచ్చాయన్న చర్చ సాగుతోంది. కదిరి పట్టణంతోపాటు రూరల్‌లో ఎనిమిది దుకాణాలకు 64 దరఖాస్తులే వచ్చాయి. ఇక్కడ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఔత్సాహిక వ్యాపారులు ముందుకు రాలేదని తెలుస్తోంది. కొందరు నేతలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేసినట్లు స్పష్టమైంది.. ధర్మవరం పట్టణంలో సైతం అతితక్కువగా వచ్చాయి. ధర్మవరం నియోజకవర్గంలో 20 దుకాణాలకు 219 దరఖాస్తులు సమర్పించారు. హిందూపురం, కదిరి, ధర్మవరంలో చాలా దుకాణాలకు సింగిల్ డిజిట్ దరఖాస్తులు వచ్చాయి.

మడకశిర నియోజకవర్గంలోని గుడిబండలో రెండు దుకాణాలు మినహా ఎనిమిదింటికి చాలా తక్కువగా దాఖలు చేశారు. చాలామంది ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తులు చేసేందుకు సిద్ధమైన అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల, బెదింపులతో ఔత్సాహికులు జంకాల్సి వచ్చింది. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లిలో ఐదు దుకాణాలకు 27 దరఖాస్తులే వచ్చాయి. అతితక్కువగా కనగానపల్లి మండలంలో 24 దుకాణాలకు నాలుగు దరఖాస్తులే దాఖలయ్యాయి. దీనినిబట్టి చూస్తే ఇక్కడ రాజకీయ ఒత్తిళ్ల సాగాయన్న విషయం స్పష్టమవుతోంది. పెనుకొండ, గోరంట్ల, రొద్దంలో మద్యం దుకాణాలకు కాస్త పోటీ కన్పించింది. మూడు మున్సిపాలిటీల్లో 22 దుకాణాలకు 208, నగర పంచాయతీల్లో ఆరింటికిగాను 121, మండలాల్లో 50 దుకాణాలకు 1131 దరఖాస్తుల చొప్పున వచ్చాయి.

పుట్టపర్తి రూరల్‌లో 85..

జిల్లాలో పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పది మద్యం దుకాణాలకు పోటాపోటీగా దరఖాస్తులు చేశారు. పుట్టపర్తి రూరల్ పరధిలో 40.., 41 దుకాణాలకు 85 దరఖాస్తులు నమోదై, జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిశాయి. ఆ తరువాత పరిగి మండలంలో రెండు దుకాణాలకు 81 దరఖాస్తులు వచ్చాయి. పుట్టపర్తి నగర పంచాయతీ, ఓబుళదేవరచెరువు, కొత్తచెరువు, బుక్కపట్నం, గుడిబండలో దుకాణాలకు దరఖాస్తులు పోటీపోటీగా వచ్చాయి. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కర్ణాటకకు చెందిన కొందరు వ్యాపారులు దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో ఒక్క దుకాణం దక్కినా చాలనే భావనతో దరఖాస్తులతో క్యూకట్టారు. ఈఅవకాశం దక్కించుకునేందుకు రాజకీయ పార్టీల నాయకుల నుంచి మద్యం దళారుల దాకా ఎత్తుకు పైఎత్తులు వేశారు. శుక్రవారం దరఖాస్తు గడువు ముగియడంతో 87 మద్యం దుకాణాలకు 1439 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. లాటరీ విధానం కోసం ఎదురుచూస్తున్నారు.

14న లాటరీ

జిల్లాలో 87 మద్యం దుకాణాలకు ఈనెల 14న పుట్టపర్తి సాయిఆరామ్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ కార్యక్రమం నిర్వహిస్తారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఎంట్రీ పాసులు జారీ చేసి, అనుమతి ఇస్తారు. ఐదేళ్ల తరువాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి తగిలినా చాలు పరపతి పెంచుకోవచ్చనేది చాలామంది భావన. ఆ అవకాశం దక్కించుకునేందుకు రాజకీయ నేతల నుంచి దిగువస్థాయి దళారులదాకా ఎత్తుకుపైఎత్తు వేస్తున్నారు.

హిందూపురం, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల్లో చాలావరకు అధికార పార్టీ నేతలే సిండికేట్‌గా ఏర్పాడి దరఖాస్తులు వేశారు. గ్రామీణ మండలాల్లో చాలా దుకాణాలకు దరఖాస్తుల్లోనే సిండికేట్ అయ్యారు. ఎవరికి లాటరీ తగిలినా వారే పంచుకునేలా ఒప్పందాలు చేసుకున్నారు. దరఖాస్తుల దాఖలుకు పరిమితి లేకపోవడంతో కొన్నిచోట్ల ఒక్కొక్కరు ఐదారు దరఖాస్తులు చేశారు. ఒక్కటైనా తగలకపోతుందా అనే భావనతో ఉన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 14న నిర్వహించే లాటరీలో లక్కెవరికో అన్న టెన్షన్ నెలకొంది.

జిల్లాలో శుక్రవారం రాత్రి 11 గంటల వరకు వచ్చిన దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్ పేరు	దుకాణాల సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
ధర్మవరం	20	219
చెన్నేకొత్తపల్లి	5	28
పెనుకొండ	13	244
పుట్టపర్తి	10	328
హిందూపురం	11	224
కదిరి	12	120
తనకల్లు	6	136
మడకశిర	10	161
మొత్తం	87	1460



హిందూపురంలో రాత్రి 8 గంటల సమయంలో దరఖాస్తులు సమర్పిస్తున్న ఔత్సాహికులు

అప్పుల ఉరికి మరో నేతన్న బలి

ధర్మవరం, అక్టోబరు 11: అప్పుల ఉరికి మరో నేతన్న వేలాడాడు. అప్పుల బాధ భరించలేక స్థానిక రాంనగర్‌లో చేనేత కార్మికుడు ఉడుముల రంగా (45) శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిసిన వివరాల మేరకు.. రంగా మగ్గం నేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర దక్కకపోవడం, ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో నష్టాలే మిగిలాయి. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, మగ్గం ముడిసరుకులకు రూ.5 లక్షలదాకా అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో మగ్గం వద్దనే ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేవగానే ఉరికి వేలాడుతున్న భర్తను చూసి భార్య రేవతి బోరున విలపించింది. చుట్టుపక్కల వారు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రేవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నేతన్నకు కుమార్తె పావన, కుమారుడు జశ్వంత్ ఉన్నారు.



రంగా (ఫైల్)

ఖాకీలపై కన్ను..!

సిబ్బంది ప్రక్షాళనకు రెడీ

పాతుకుపోయినవారికి స్థానచలనం తప్పదా?

సబ్ డివిజన్ల వారీగా వివరాల సేకరణ

త్వరలోనే పోలీసు బదిలీలు

హిందూపురం, అక్టోబరు 11: వైసీపీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఓ వైపు రాజకీయ నేతలు, మరోవైపు నేరస్థులతో అంటకాగుతూ శాంతిభద్రతలు మరిచారన్న అపవాదను పోలీసు శాఖ మూటగట్టుకుంది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీతో అంటకాగిన కొంత మంది అధికారులు, సిబ్బంది నేటికీ అదే స్టేషన్‌లో పనిచేస్తున్నారు. వైసీపీ ఓడిపోయి కూటమి, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ వారికి స్థానచలనం కల్పించలేదు. దీంతో కొన్ని పోలీసు స్టేషన్లలో నేటికీ వైసీపీ నాయకుల మాటే చెల్లుబాటవుతోందని కూటమి నాయకులు గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ అపవాదును తుడిపేసి, పోలీసు శాఖను ప్రక్షాళన చేసేందుకు ఎస్పీ రత్న సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే స్పెషల్‌బ్రాంచ్ ద్వారా ఆయా సబ్‌డివిజన్ల వారీగా వివరాలు తీసుకున్నారు. ఏయే స్టేషన్‌లో ఏ కానిస్టేబుల్ ఎన్నేళ్లుగా పనిచేస్తున్నారు, వేరేచోటికి బదిలీ చేసినా మళ్లీ అటాచ్‌మెంట్ పేరుతో అదే స్టేషన్‌కు ఎందుకొచ్చారు, వారి పనితీరు ఎలా ఉంది? నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో కిందిస్థాయి సిబ్బంది వైఫల్యం ఏంటన్న అంశాలను క్రోడీకరించారని తెలిసింది. అందుకు అనుగుణంగా సిబ్బంది ప్రక్షాళన చేసేందుకు ఎస్పీ సిద్ధమయ్యారు. దసరా పండగ తరువాత బదిలీలు ఉండొచ్చని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

పాతుకుపోయిన వారికి స్థానచలనం..!

జిల్లాలోని కొన్ని సబ్‌డివిజన్లలో కొంతమంది కానిస్టేబుళ్ల, హెడ్‌కానిస్టేబుళ్ల, ఏఎస్‌ఐలు పది నుంచి 20ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేశారు. వీరు ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ ప్రభుత్వానికి అనుకూలంగా మాటలు చెబుతూ ఒకే సబ్‌డివిజన్‌లో కాలం గడిపేస్తున్నారు. ఈసారి ఇలాంటి వారి వివరాలు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా తెప్పించుకున్నట్లు తెలిసింది. కొన్నిరోజుల్లో వీరికి స్థాన చలనం కల్పించనున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. కాకపోతే జిల్లాలో ఒకట్రెండు చోట్ల పాతుకుపోయిన వారికి కూటమి నాయకులు అండగా నిలుస్తున్నా ఎస్పీ మాత్రం వదిలే ప్రసక్తేలేదని చెప్పినట్లు సమాచారం. వాస్తవానికి బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినా ఆ సమయంలోపు సిబ్బంది పనితీరు బేరీజువేసి ట్రాన్స్‌పర్లు పూర్తి చేయడం సాధ్యం కాలేదు. దీంతో కొంత ఆలస్యమైనా స్టేషన్ల వారీగా సమీక్షను నిర్వహించి సిబ్బందిలో బాధ్యత పెంచేలా ఎస్పీ చర్యలు తీసుకుంటున్నారు.

వివరాల సేకరణ

జిల్లాలో పోలీసు సబ్‌డివిజన్ వారీగా ఎస్పీ ఇప్పటికే వివరాలు సేకరించారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీసినట్లు తెలిసింది. పలు స్టేషన్లలో పనిచేయాల్సిన సిబ్బందికి నేరస్థులతో సంబంధాలున్నాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. వాటిని పరిశీలించి, వాస్తవమని తేలితే సిబ్బందిని దూర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొన్ని స్టేషన్లలో సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. అలాంటి వారి జాబితాను తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపారు. దాని ఆధారంగా వారి పనితీరు చూసి బదిలీ చేయించేందుకు సిద్ధమవుతున్నారు. మొదట స్పెషల్‌బ్రాంచ్ (ఎస్బీ) ద్వారా ఆయా సిబ్బంది, వారి పనితీరుపై వివరాలు తీసుకున్నారు. వీరు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు ఏమాత్రం అందుబాటులో ఉన్నారు, స్టేషన్‌కు వెళ్లిన వారిపట్ల వ్యవహరించిన తీరు, వారిపై ఆరోపణలు, కూటమి నాయకుల ఫిర్యాదు దృష్టిలో ఉంచుకుని బదిలీ చేసేందుకు సన్నద్ధ అవుతున్నారు. ఇందులో కొంతమందిని సబ్‌డివిజన్లు మార్పించాలనీ, మరికొంతమందిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో జిల్లావ్యాప్తంగా బదిలీలకు త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం.




వైద్యంపైనా నిర్లక్ష్యమే.!



వైసీపీ హయాంలో ఆగిన నిర్మాణ పనులు

- పైసా నిధులివ్వని దుస్థితి
- అటకెక్కిన పనులు



ముదిగుబ్బ, అక్టోబరు11: స్థానిక పీహెచ్‌సీని విస్తరించడానికి గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పట్లో రూ.90లక్షల వ్యయంతో పనులు ప్రారంభించింది. శ్లాబు వరకు పనులు కూడా పూర్తయ్యాయి. ఆ తరువాత 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది, అధికారం చేపట్టింది. ఆస్పత్రి నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేయకుండా ఆపేయడంతో పనులు అసంపూర్తిగానే మిగిలాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క పిల్లర్ కూడా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయలేదు. ఆస్పత్రి భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలచి, కంపచెట్లకు నిలయంగా మారింది. అర్ధంతరంగా ఆగిపోయిన ఆస్పత్రి భవన నిర్మాణం.. మొండిగోడలతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.

ముదిగుబ్బ మధ్యలో నుంచే కదిరి-అనంతపురం రహదారి వెళ్తుంది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ నిర్మిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత పెరిగాయి. చాలామంది ప్రాణాపాయ పరిస్థితుల్లో ముదిగుబ్బకు వస్తుంటారు. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కనీస వసతులు ఉండేవి కావు. అత్యవసర వైద్యానికి అవకాశం ఉండేది కాదు. దీనిని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం ముదిగుబ్బ పీహెచ్‌సీని విస్తరించాలనీ, సౌకర్యాలు పెంచాలని నిర్ణయించింది. ఆ మేరకు నూతన ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శ్లాబు వరకు పనులు కూడా పూర్తయ్యాయి. కొన్ని నెలల్లోనే కొత్త ఆస్పత్రి, అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మండల ప్రజలు ఆశించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ఆశలన్నీ అడియాసలయ్యాయి. ప్రజల ప్రాణాలు నిలిపే ఆస్పత్రి నిర్మాణంపై అప్పటి వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఐదేళ్లలో రూపాయి కూడా నిధులివ్వలేదు. దీంతో చేసేదిలేక కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. ఆస్పత్రి భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగిపోయాయి. గత వైసీపీ పాలనకు నిదర్శనంగా ఆస్పత్రి భవనం నిలుస్తోంది.

రంగులు మాత్రం వేశారు..

ప్రస్తుతం పీహెచ్‌సీని పక్కనే ఉన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. కొత్త భవనాన్ని నిర్మించని గత పాలకులు.. పక్కనే ఉన్న పాత గదులకు మాత్రం పార్టీ రంగులు వేశారు. అక్కడే చికిత్స అందిస్తున్నారు. అందులో బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు కూడా లేవు. గతంలో పీహెచ్‌సీలో నలుగురు వైద్యాధికారులు పనిచేస్తుండేవారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు గ్రామాల్లోని మినీ హెల్త్ సెంటర్లను పర్యవేక్షించడానికి వెళ్తుండగా.. ఒకరు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. ముదిగుబ్బలో రహదారి నిర్మాణ పనులు చేపడుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో పీహెచ్‌సీకి వస్తున్నారు. ఇక్కడ కనీస వసతుల్లేక ప్రథమ చికిత్సతో సరిపెట్టి కదిరి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రులకు పంపాల్సి వస్తోంది. దారి మధ్యలో పలువురు ప్రాణాలు కోల్పోతూ.. ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మండల ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం కదిరి, బత్తలపల్లి వెళ్లాల్సి వస్తోంది. వెంటనే నూతన భవన నిర్మాణం పూర్తిచేసి, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సత్యకుమార్ యాదవ్.. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆస్పత్రి రూపురేఖలు మారుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.


ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలి



నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలి. చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు సైతం కదిరి, అనంతపురం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వెంటనే ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తిచేసి, వైద్యసేవలు అందించాలి.

- పోతులయ్య, గుంజేపల్లి

ప్రథమ చికిత్సతో సరి..



ప్రాణాపాయ స్థితిలో పీహెచ్‌సీకి వచ్చినవారికి ప్రథ మ చికిత్స చేసి, కదిరి, బత్తలపల్లి ఆస్పత్రులకు తీసుకెళ్లాలని చెబుతున్నారు. తరలించే క్రమం లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. వెంటనే ఆస్పత్రి నిర్మా ణం పూర్తిచేసి, అత్యవసర వైద్యం అందించాలి.

- కేతన వెంకటపతి, ముదిగుబ్బ

నేరాలను ప్రోత్సహిస్తున్న ఎస్పీ

నా హత్యకు వందశాతం ప్రయత్నాలు

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 11: ఎస్పీ నేరాలను ప్రోత్సహిస్తున్నారని, ఆయన ప్రోద్బలంతో జేసీ కుటుంబం తనపై దాడి చేసే అవకాశం ఉందని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. రామ్‌నగర్‌లో తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీపై తనకు నమ్మకం పోయిందని అన్నారు. 'యంగ్‌స్టర్ కదా.. జిల్లాను ఉద్ధరిస్తాడనుకున్నాను. కానీ క్రైంను ప్రోత్సహిస్తాడను కోలేదు' అని అన్నారు. 2006 ఏప్రిల్‌లో తన సోదరుడి హత్య జరిగిందని, ఇందులో కింది స్థాయి పోలీసు అధికారులదే కీలక పాత్ర అని ఆరోపించారు. తనపై ఎవరైనా దాడి చేస్తే పోలీసు అధికారులు ప్రేక్షక పాత్ర వహించాలని ఎస్పీ చెబుతున్నారని ఆరోపించారు. ఈ ఎస్పీ ఉన్నంతవరకు తనకు న్యాయం జరగదని కొందరు పోలీసు అధికారులు చెబుతున్నారని అన్నారు. భద్రత దృష్ట్యా ఎస్పీకి ఫోన్ చేసినా స్పందించడం లేదని అన్నారు. కిందిస్థాయి అధికారులను అడిగితే పై అధికారులు చెప్పాలంటున్నారని, పై అధికారి ఎవరో తనకు తెలియదని అన్నారు. తమను ఎంత ఇబ్బంది పెట్టినా, కార్యకర్తలు, అనుచరులను కొట్టినా, తిట్టినా పార్టీలోనే ఉంటామని, పార్టీని వదిలే ప్రసక్తే లేదని అన్నారు. సిట్ అధికారులు తాడిపత్రికి వచ్చి అన్నీ చూసిపోయి ఐదు నెలలైందని, కానీ మూడు ఎఫ్ఐఆర్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో ఎస్పీ చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ విచారించి పోయినా సంబంధం లేకుండా ఇలా కేసులు పెడుతున్నారంటే అర్థం ఏమిటని ప్రశ్నించారు. తనపై ఎస్పీకి ద్వేషం ఎందుకో అర్థం కావడం లేదని, ఆయనతో తనకు ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. కానీ తనను హత్య చేసేందుకు వంద శాతం ప్రయత్నిస్తున్నారని, జేసీతో ఎస్పీ ఎంత లబ్ధి పొందారో తనకు తెలుసని అన్నారు.



మాట్లాడుతున్న పెద్దారెడ్డి

శక్తి స్వరూపిణీ.. నమో నమః

నేడు విజయ దశమి.. వేడుకలకు సిద్ధమైన ప్రజలు

అనంతపురం కల్చరల్ : శక్తి స్వరూపిణి దుర్గామాతను తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజించిన జిల్లా ప్రజలు పదో రోజు విజయ దశమి వేడుకలకు సిద్ధమయ్యారు. అమ్మవారిని సేవించేందుకు పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. మామిడి ఆకులు, అరటి పిలకలు, పూలు, పండ్లు కొనేందుకు వచ్చినవారితో మార్కెట్‌లలో శుక్రవారం సందడి కనిపించింది. విజయదశమి రోజునే రావణుడిపై శ్రీరాముడు గెలిచాడని, అజ్ఞాతవాసం అనంతరం పాండవులు జమ్మి చెట్టు నుంచి తమ ఆయుధాలను తిరిగి తీశారని పురాణాలు చెబుతున్నాయి. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడితో 9 రోజులు 9 రూపాల్లో యుద్ధం చేసి, వధించారని, ఆ సందర్భంగా 10వ రోజున విజయదశమిని నిర్వహించుకుంటారని పెద్దలు చెబుతారు. ఆయుధపూజ సందర్భంగా శుక్రవారం ఉదయం వాహనాలు, యంత్రాలతోపాటు వ్యవసాయ, వృత్తి పనిముట్లకు జనం పూజలు నిర్వహించారు.



అనంతపురంలో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

టీడీపీ కార్యకర్తపై దాడి

గొర్రెల దొంగతనంపై ఫిర్యాదు చేసినందుకే..

బీకేఎస్‌లో రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 11: గొర్రెల దొంగతనం గురించి ఫిర్యాదు చేసినందుకు టీడీపీ కార్యకర్తలుపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తన గొర్రెలను ఈ నెల 6న గాంధీనగర్‌కు చెందిన శివ, బుక్కరాయసముద్రానికి చెందిన ఈశ్వరయ్య, మరో ఇద్దరు కలిసి దొంగతనం చేశారని బుక్కరాయసముద్రానికి చెందిన చెరుకూరి నారాయణస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం చేసే సమయంలో శివ దొరికాడు. అతనితోపాటు ఈశ్వరయ్యను పట్టుకుని బుక్కరాయసముద్రం పోలీసులుకు అప్పగించారు. కానీ పోలీసులు ఈ కేసు దర్యాప్తు గురించి పెద్దగా పట్టించుకోలేదు. దొంగతనం కేసులో సూత్రధారులపై కేసు నమోదు చేయలేదు. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్త ఈశ్వరయ్య, ఆయన బంధువులు చెరుకూరి నారాయణస్వామి ఇంటిపైకి శుక్రవారం వెళ్లారు. నారాయణస్వామి, ఆయన భార్య, కుమారుడు యాగంటిపై దాడి చేశారు. ప్రశ్నించిన బంధువులపైనా దాడి చేశారు. ఈ క్రమంలో బాధితులు ఎదురు దాడి చేశారు. గాయపడిన ఇరువర్గాలవారు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు విచారణ చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా తమపై దాడి జరిగిందని నారాయణస్వామి కుటుంబం వాపోయింది. దొంగతనం కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుని ఉంటే తమపై దాడి జరిగేది కాదని అన్నారు.



నేడు విజయదశమి

తెలుగు వారికి పండగలంటే ఎంత ముఖ్యమో.. ఆ పండగల సందర్భంలో చేసే వంటలు కూడా అంతే ముఖ్యం. పండుగల సందర్భంగా చేసుకొనే అనేక వంటలను మన పూర్వీకులు గ్రంథస్తం చేశారు. అలాంటి కొన్ని అరుదైన వంటలను దసరా పండగనాడు చేసుకోవటానికి వీలుగా మీకు అందిస్తున్నాం..

వంటిల్లు

దసరా వేళ అరుదైన వంటలు

సరడాల పాసెం


క్రీ.శ. 1800 నాటి 'వెంకటాచల విహార శతకం'లో 'సరడాల పాసెం' అనే వంటకం ప్రస్తావన ఉంది. సంస్కృతంలో వంకీల నెక్లెస్ శరణ్ణ అంటారు. బహుశా అందుకే వెంకటాచల కవి తెలుగులో దీనిని తెలుగులో 'సరదు' అన్నారు. సరడాల పాసెం అంటే వంకీల దండలాగా ఒత్తి వండిన పాలతాలికల్లాంటి వంటకం. శ్రీనాథుడు రాసిన 'చిరువడముల పాయసం' కూడా ఇదే కావచ్చు. వడములంటే తాళ్ళు. సన్నని తాళ్లలా ఒత్తి కలిపితే చిరువడముల పాయసం.

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం- ఒక కప్పు, బియ్యపు పిండి- రెండు కప్పులు, బెల్లం పొడి- ఒక కప్పు, పాలు- ఒక లీటరు, డ్రైఫ్రూట్స్- తగినన్ని, నెయ్యి- తగినంత ఏలకుల పొడి- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ముందుగా సగ్గుబియ్యాన్ని బాగా కడిగి - రెండు గంటలు నానబెట్టాలి.
- ఒక మూకుడులో నెయ్యిని కాచి.. దానిలో డ్రైఫ్రూట్స్‌ను వేసి వేయించాలి. వాటిని బయటకు తీసి ఒక ప్లేటులో చల్లార్చాలి.
- ఆ మూకుడులోనే సగం కప్పు బెల్లం పొడి, నీళ్ల కలిపి లేత పాకం పట్టాలి. దానిలో కప్పు బియ్యం పొడి వేసి ముద్దగా చేయాలి.
- ఇలా చేసిన ముద్దను సన్నని దారపు పోగుల్లా ఒత్తుకోవాలి. వీటిని కొద్ది సేపు ఆరనివ్వాలి.
- మరో గిన్నెలో పాలను బాగా మరిగించాలి. ఈ పాలలో సగ్గుబియ్యం వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన పాలలో మిగిలిన సగం కప్పు బెల్లం వేయాలి.
- ఈ మిశ్రమం చిక్కపడుతున్న సమయంలో దానిలో ముందుగా చేసి ఉంచిన బియ్యపు తాలికలను వేయాలి. ఆ తర్వాత డ్రైఫ్రూట్స్‌ను వేయాలి.



జాగ్రత్తలు

- బెల్లం పాకం పట్టే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పాకం ముదిరితే తాలికలు చేయటం చాలా కష్టమయిపోతుంది.
- పాలను ఎంత ఎక్కువగా కాస్తే- అంత చిక్కని పాసెం తయారవుతుంది.



ఆవపచ్చడి

ఆహారాన్ని సులభంగా అరిగించే శక్తి ఆవపచ్చడికి ఉంది. అందుకే ఒకప్పుడు పండగ రోజుల్లో ఆవపచ్చడిని తప్పనిసరిగా చేసేవారు. "ముకు మండై యేర్చు నావం జిగుర్కొను పచ్చళ్ళు" అంటూ రాయల వారు ఆముక్తమాల్యదలో ఆవకూరనీ, ఆవపచ్చడినీ జలుబు నీళ్లు వదిల్చే ముక్కుమందుగా అభివర్ణించాడు. "మిసిమి కలిగిన బంగారపు రంగు పుల్లపెరుగులో ఆవపిండి కలిపి తాలింపు పెట్టిన ఆవపెరుగుపచ్చడిని అతిథులు ఆస్వాదిస్తూ దాన్ని జుర్రుకోగానే.. ఆ ఘాటుకి మూర్ధాలదిరి, ఒర్రదనం నషాలానికి అంటిందనీ.. ముక్కుల్లోంచి పొగలు వెడలినాయనీ" అంటాడు శ్రీనాథుడు. అలాంటి ఆవపచ్చడి ఎలా చేయాలో చూద్దాం..

జాగ్రత్తలు

- ఆవాలను సన్నటి సెగ మీద వేయించాలి. ఎక్కువ వేడి తగిలితే ఆవాలు మాడిపోతాయి.
- కొందరు ఈ పచ్చడిలో తాలింపు పెడతారు. తాలింపు పెట్టకపోయినా తినటానికి చాలా బావుంటుంది.

కావాల్సిన పదార్థాలు

ఆవాలు- రెండు చెంచాలు, కూరముక్కలు- మూడు కప్పులు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, పెరుగు- మూడు కప్పులు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఆవాలను దోరగా వేయించి.. వాటిని మిక్సీలో పొడి చేయాలి.
- కూరముక్కలను నీళ్లలో కానీ కుక్కర్‌లో కానీ మెత్తపడేదాకా ఉడకపెట్టాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక గిన్నెలో చల్లారిన కూరముక్కలు, పెరుగు, కొత్తిమీర, కొబ్బరి తురుము, ఉప్పు వేసి బాగా కలపాలి. దీనిలో ఆవాల పొడిని కలపాలి.
- ఈ పచ్చడిని గంట సేపు మూతపెట్టి మగ్గనివ్వాలి. దీని వల్ల ఆవ ఘాటు పచ్చడి అంతా వ్యాపిస్తుంది.

అంగరొల్లెలు

'అంగ' అంటే కాల్చు, కప్పు అని రెండర్థాలున్నాయి. ఒల్లె అంటే మృదువైనదని అర్థం. మంటలో కాల్చిన తర్వాత మృదువుగా ఉండే తత్వం ఉంది కాబట్టి శ్రీనాథుడు వీటిని అంగర పూవియలు అన్నాడు. ఉత్తర భారత దేశంలో వీటిని చోఖాభాటీ అంటారు. వీటిని వంకాయ బజ్జీ పచ్చడితో కలిపి తింటారు.

కావాల్సిన పదార్థాలు

శనగపిండి- ఒక కప్పు, జీలకర్ర- అర స్పూను, వాము- పావు స్పూను, ఎర్రకారం- ఒక స్పూను, సన్నగా తరిగిన అల్లం- అర స్పూను, పచ్చిమిర్చి- ఒక స్పూను, వెల్లుల్లి- రెండు రెబ్బలు, సన్నగా తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, సైంధవ లవణం- పావు స్పూను, నిమ్మ రసం- రెండు స్పూనులు, నెయ్యి- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- శనగపిండిని నీళ్లు పోసి గట్టిగా కలిపి చిన్న చిన్న ఉండలుగా చేయాలి.
- జీలకర్ర, వాము, ఎర్రకారం, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొత్తిమీర, సైంధవ లవణం, నిమ్మరసంలను ఒక గిన్నెలో వేసి స్పూనుతో మెత్తగా చేయాలి.
- శనగపిండి ఉండలను పూరీల మాదిరిగా ఒత్తాలి. వీటిలో తయారుచేసిన మిశ్రమాన్ని పెట్టి- చిన్న చిన్న ఉండలుగా చేయాలి. వీటికి నెయ్యి రాయాలి.
- ఈ ఉండలను బొగ్గు మీద కాల్చాలి. ఒక వేళ బొగ్గులు లేకపోతే గ్యాస్‌స్టౌవ్ మీద గ్రిల్ పెట్టి సన్నటి మంటపైన కాల్చాలి.
- కాల్చిన తర్వాత పైన నల్లగా ఒక పొర ఏర్పడుతుంది. ఆ పొరను వలిచి తినాలి.



జాగ్రత్తలు

- శనగపిండిని కలిపే సమయంలో ఉండలు లేకుండా చూసుకోవాలి.
- అంగరొల్లెలను కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ మంటపై కాలిస్తే బొగ్గులా మారిపోతుంది.



చెఫ్: **వి.నగేష్**
వివాహ భోజనంబు
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీరాజరాజేశ్వరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ నవమి/దశమి (విజయదశమి)- శనివారం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో... చివరి రోజైన విజయ దశమి నాడు విజయవాడ కనకదుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారు. ఆమె సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత. షోడశ మహా మంత్ర స్వరూపిణి అయిన శ్రీరాజరాజేశ్వరిని మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గానూ పిలుస్తారు. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు ఆమె అనుగ్రహిస్తుంది. మాయామోహితమైన మానవ చైతన్యాన్ని యోగమూర్తిగా ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి అధిష్ఠాన దేవత అయిన శ్రీ రాజరాజేశ్వరీ దేవిని పూజిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, మనసారా కొలిస్తే బ్రహ్మజ్ఞానాన్ని ఆమె కలుగజేస్తుందనీ నమ్మిక. దసరా ఉత్సవాల సంపూర్ణ పుణ్యాన్ని భక్తులందరికీ అందించే చల్లని తల్లి దుర్గమ్మను రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శిస్తే సకల శుభాలు, విజయాలు లభిస్తాయన్నది భక్తుల విశ్వాసం. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం: పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు
అలంకరించే చీర రంగు: ఆకుపచ్చ, తెలుపు
వేటితో అర్చించాలి: ఎర్రటిపూలు
పారాయణ చెయ్యాల్సినవి: లలితా సహస్రనామం

వాటిని గెలవాలి!

పురాణపరంగానే కాకుండా సాంస్కృతికంగానూ ప్రాముఖ్యం ఉన్న పండుగ విజయదశమి. చెడుపై మంచి గెలిచిన రోజుగా దసరా పండుగను ఘనంగా నిర్వహిస్తారు. మానవులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాలను జయించాలనీ, అదే ఈ విజయదశమి పండుగలోని అంతరార్థమనీ పెద్దలు చెబుతారు. విజయదశమి నాడు ఏది ప్రారంభించినా విజయం తథ్యం అనే విశ్వాసం ఉంది.

శమీ శత్రు వినాశినీ...

శమీ వృక్షం (జమ్మి చెట్టు)లో అపరాజితా దేవి కొలువై ఉంటుందని విశ్వాసం. విజయదశమి రోజున అపరాజితా దేవిని శమీవృక్షం వద్ద పూజించే సంప్రదాయం ఉంది. ఉద్భవించిన పవిత్రమైన దేవతా వృక్షాల్లో జమ్మి చెట్టు ఒకటని చెబుతారు. రావణ సంహారానికి ముందు శ్రీరాముడు శమీ వృక్షానికీ, అపరాజితా దేవికీ పూజలు ఆచరించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. పాండవులు అజ్ఞాతవాసం ముందు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద దాచారనీ, అజ్ఞాతవాసం ముగిశాక వాటిని తిరిగి తీసుకున్నారనీ మహాభారతంలో కథ ఉంది. దసరా నాడు...



శమీ శమయతే పాపం శమీ శత్రువినాశిని అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని... అనే శ్లోకం పఠించి, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే... శత్రు భయం తొలగి విజయం చేకూరుతుందనీ సకల కార్యసిద్ధి కలుగుతుందనీ పెద్దలు చెబుతారు.

శుభప్రదం పాలపిట్ట దర్శనం

దసరా పండుగలో శమీ వృక్షంతో పాటు పాలపిట్టకు ఉన్న ప్రాధాన్యం కూడా ఎక్కువే. పాలపిట్టను పవిత్రంగా భావించడం వెనుక ఉన్న జానపద గాథ ప్రకారం... పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి తిరిగి వస్తూ ఉండగా, వారికి పాలపిట్ట కనిపించింది. వారు దాన్ని చూసినప్పటి నుంచీ వరుసగా అన్నీ విజయాలే కలిగాయట! అందుకే విజయ దశమి రోజున పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో పాలపిట్టను భక్తిప్రపత్తులతో ఆరాధిస్తారు.



అలనాటి కథ



నాకు తెలిసిన రతన్ టాటా!

గురువారం ఉదయం మామూలుగానే లేచా.. లేచిన వెంటనే పత్రికలు చూడటం అలవాటు. పేపరు తెరిచిన వెంటనే 'రతన్ టాటా ఇక లేరు' అనే హెడ్డింగ్ కనిపించింది. ఒక్క నిమిషం షాక్ తగిలినట్లు అనిపించింది. వెంటనే ప్రిన్సెస్ ఏస్రాకు మెసేజ్ పంపించాను. తనకు కూడా ఆ దుర్వార్త తెలియదు అనుకుంటా! షాక్ తింది. రతన్ టాటాతో మా అనుబంధం ఈనాటిది కాదు.



మాకు ముంబాయిలో ప్యాలెస్ ఉంది. ఈ ప్యాలెస్‌లో నాన్న రాజా ధన్‌రాజ్‌గిరి పార్టీలు ఇస్తూ ఉండేవారు. ఈ పార్టీలకు ముంబాయిలో ఉన్న రాజ కుటుంబీకులు, పార్సీ వాణిజ్యవేత్తలు, రాజకీయ నాయకులు- ఇలా అనేక మంది హాజరవుతూ ఉండేవారు. ఇలా నాకు జేఆర్‌డీ టాటా తెలుసు. ఆయన భార్య కూడా తెలుసు. ఆమె అప్పుడప్పుడు మమ్మల్ని వాళ్లింటికి మధ్యాహ్న భోజనాలకు పిలిచేది. మంచి పార్సీ వంటలు వండించి పెట్టేది. జేఆర్‌డీ ద్వారా మాకు నోవెల్ టాటా, ఆయన భార్య సినోమి కూడా తెలుసు. వారితో పాటుగా రతన్ టాటా కూడా పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో ముంబాయి- ఇప్పుడున్నంత హడావిడిగా ఉండేది కాదు. సాయంత్రాలు అనేక మంది బీచ్ ఒడ్డున కూర్చుని స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. నేను కూడా అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి బీచ్‌లకు వెళ్తూ ఉండేదాన్ని. ఆ సమయంలో నాకు ఉన్న స్నేహితురాలు లీనా భక్తావర్‌లో ఒక ఫ్లాట్‌లో నివసించేది. ఆ ఫ్లాట్లలోనే రతన్ కూడా నివసించేవాడు. లీనా దగ్గరకు వెళ్లినప్పుడు ఎదురుపడేవాళ్లం. మాట్లాడుకొనేవాళ్లం. ఇక నా చెల్లెలు రేణుకకు తన క్లాస్‌మేట్ అనుకుంటా. అందుకే అప్పుడప్పుడు రతన్ గురించి ప్రస్తావన వచ్చేది. రతన్ చూడటానికి అందంగా, హుందాగా ఉండేవాడు. తక్కువగా మాట్లాడేవాడు. తండ్రి మాట జవదాటడని చెప్పుకుంటూ ఉండేవాళ్లం. బహుశా అందుకే తనకు ఇష్టం లేకపోయినా అమెరికా నుంచి వచ్చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాతి కాలంలో నేను హైదరాబాద్ వచ్చేసాను. మాకు కొంత మంది కామన్ ఫ్రెండ్స్ ఉన్నా- ఎక్కువ సార్లు కలవలేదు.

రతన్‌ను నేను మళ్లీ కలిసింది- ఫలక్ నామా ప్యాలెస్ ప్రారంభోత్సవంలో. టాటా గ్రూపునకు చెందిన తాజ్ హోటల్స్ ఈ ప్యాలెస్‌ను లీజ్‌కు తీసుకొని హోటల్‌గా పునరుద్ధరించారు. దీని ప్రారంభోత్సవానికి దేశంలోని అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. టాటా గ్రూపు ఛైర్మన్ హోదాలో రతన్ కూడా వచ్చారు. ఆ సమయంలో మళ్లీ తనను కలిసాను. కాలేజీలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ఉన్నాడో.. అంతే హుందాగా ఉన్నాడు. ఆప్యాయంగా పలకరించాడు. ఆ తర్వాత మేమిద్దరం పెద్దగా కలసినది లేదు. కానీ తన వ్యక్తిత్వంతో ఒక చెరగని ముద్ర వేశాడు. నాకు తెలిసి- శత్రువులు లేని అతి కొద్ది మంది వ్యక్తుల్లో రతన్ కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 1962లో ఇండో-చైనా యుద్ధం జరుగుతున్న సమయంలో అనుకుంటా- రతన్ అమెరికాలో ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కానీ రతన్ కొన్ని కారణాల వల్ల భారత్‌కు తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. ఆ అమ్మాయి ఇండియాకు రాలేని పరిస్థితి. దాంతో ఆ పెళ్లి ఆగిపోయింది. ఆ సమయంలో ముంబాయి సోషల్ సర్కిల్స్‌లో అదొక పెద్ద వార్త. కారణం తెలియదు కానీ- ఆ తర్వాతి కాలంలో రతన్ ఎవరినీ పెళ్లి చేసుకోలేదు. ఒంటరిగానే మిగిలిపోయాడు. ఆ ఒంటరితనాన్ని కూడా హుందాగా గడిపాడు. తాను చిన్నప్పటి నుంచి నేర్చుకున్న విలువలను తుదిదాకా వీడని అతి కొద్ది మందిలో రతన్ ప్రథమ స్థానంలో ఉంటాడనటంలో ఎటువంటి సందేహం లేదు!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

భోజన విధి

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

ఆయుర్వేద సంహితా గ్రంథాల యుగం తరువాత ఆహార ప్రాధాన్యతని వివరిస్తూ 15వ శతాబ్దిలో క్షేమశర్మ- "క్షేమకుతూహలం". 15వ శతాబ్దిలో పండిత రఘునాథ సూరి "భోజనకుతూహలం" గ్రంథాలను వెలువరించారు. క్షేమకుతూహలంలో లేని అనేక ఆహారవైద్య విషయాలు భోజనకుతూహలంలో ఉన్నాయి. 1678లో తంజావూరులో మరాఠా రాజ్యస్థాపన చేసిన ఏకోజీ (శివాజీ సవతి సోదరుడు) రాణి దీపాంబికల ప్రోత్సాహంతో రఘునాథ పండితుడు భోజన కుతూహలం రాశాడు. తంజావూరులోనే నివసించాడు. అక్కడి తెలుగు వారితో పరిచయం కారణంగా భోజన కుతూహలంలో తెలుగుదనం కనిపిస్తుంది. ఇది సంస్కృత రచనే అయినా మనకు దగ్గరగా ఉంటుంది. కుతూహలం అంటే ఉత్సాహం, కోరిక అనే కాదు, అద్భుతమైన, ఉన్నతమైన, గొప్పదైన, ప్రశంసనీయమైన అనే అర్థాలు కూడా ఉన్నాయి. భోజనం తయారీ, దాన్ని వడ్డించటం, తినటం లాంటి విషయాల్లోని శాస్త్రీయతను వివరించటమే ఈ భోజనకుతూహలం లక్ష్యం.

అన్నమే ప్రాణాన్నిస్తోంది. అన్నమే సమస్త జీవులకూ పోషణ నిస్తోంది. ఆయుష్షునిస్తోంది. ఈ సృష్టి మొత్తాన్ని సంరక్షిస్తోంది. అన్నం లేకపోతే జీవి లేడు, జీవం లేదు. ప్రాణదాత అయిన అన్నానికి దణ్ణాలు చెపుఙ్కుంటూ రఘునాథ సూరి షుమారుగా 350 ఏళ్ల క్రితం రాసిన భోజన కుతూహలం గ్రంథం కుతూహలం కలిగించే అనేక ఆహార విషయాల సమాహారంగా సాగుతుంది. "ఇతి వ్యాసస్మరణాచ్చ భోజనద్రవ్యాణి తద్గుణాశ్చభిదీయతేఖ"- ఈ విధంగా వ్యాసభగవానుణ్ణి స్మరించుకుంటూ, భోజన ద్రవ్యాలు, వాటి గుణాలు చక్కగా వివరిస్తానని సంకల్పం చెప్పుకొని భోజనకుతూహలం గ్రంథాన్ని ప్రారంభిస్తాడు పండిత రఘునాథ సూరి.

"జీర్ణే హితం మితం చాద్యాత్ ఇత్యాయుర్వేదోపదేశాత్
భోక్తవ్యం సఘృతం సోష్ణం హితమ్ పథ్యం మితం తథాఖ!"

అనే శ్లోకంలో ఎలాంటి ఆహారాన్ని తినాలనే విషయాన్ని వర్ణిస్తాడు, దీనిలో కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి.

జీర్ణశక్తి ఆధారంగా..

సాధారణంగా తేలికగా జీర్ణమయ్యే పదార్థాలే తినాలి. మన జీర్ణశక్తి ఎంత సమర్థమైనదో దాన్ని బట్టి తీసుకోదగిన ఆహారాన్ని ఎంచుకోవాలి. పర్వతాలు ఫలహారం చేయగలంత జీర్ణశక్తి ఉన్నవారికి ఏది తిన్నా చెల్లిపోతుంది. కానీ కడుపులో జాఠరాగ్ని అరకొరగా ఉన్నప్పుడు ఏదో ఒక సమస్య బాధిస్తూనే ఉంటుంది సమస్తమైన అనారోగ్యాలకూ జీర్ణశక్తి వైఫల్యమే మొదటి కారణం. కాబట్టి ప్రయత్న పూర్వకంగా అగ్నిబలం కాపాడలంటుంది శాస్త్రం.

జీర్ణే అంటే ఒకసారి తీసుకున్న ఆహారం పూర్తిగా అరిగాకే మరో ఆహారం తినాలని.

నాలుగు సూత్రాలు

"సఘృతం సోష్ణం హితమ్ పథ్యం" అంటూ ఆహారానికి సంబంధించి నాలుగు సూత్రాలను రఘునాథ పండితుడు వివరిస్తున్నాడు. అవి

1) కల్తీ లేని మంచి నెయ్యితో భోజనం
2) వేడిగా తాజాగా ఉన్న ఆహారం
3) సరిపడే పదార్థాలను తెలుసుకుని తినటం
4) మోతాదెరిగి మితంగా తినటం



హితవైన ఆహారం

తినబోయే ముందు ఆ పదార్థం మన శరీరానికి సరిపడుతుందో.. లేదో కూడా ఆలోచన చేయాలి. ఒకప్పటికన్నా ఎలర్జీ రోగుల సంఖ్య ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఎలర్జీ తీవ్రతను తగ్గించాలంటే ఆచితూచి తినటం అవసరం.

మితాహారం: ఏ పదార్థాన్నయినా మితంగానే తినాలి. ఒకే పదార్థాన్ని అదేపనిగా తింటే వికటిస్తుంది. ఆహారం అనేది ఔషధం కాబట్టి మోతాదెరిగి తీసుకోవాలి.

అద్యం: అద్యం అంటే అన్ని పోషకాలూ కలిగి ఆరురుచులతో కూడిన రాజభోజనం అని!

ఆయుర్వేదం వివిధ ఆహార ద్రవ్యాలలోని పోషకాలను వాటికి గల రుచులను బట్టి నిర్ణయిస్తుంది.
మనం తినే మొత్తం అన్నంలో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ ఉండేలా చూసుకుంటే అది 'అద్యం'.

బిజినెస్

ఆదాయ పన్ను వసూళ్లలో 18 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) నికర వసూళ్లు అక్టోబరు 10వ తేదీ నాటికి 18.3 శాతం పెరిగి రూ.11.25 లక్షల కోట్లకు చేరాయి. అందులో వ్యక్తిగత ఐటీ వసూళ్లు రూ.5.98 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇవికాకుండా సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో రూ.30,630 కోట్లు, ఇతర పన్నులు రూ.2150 కోట్లు ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన పన్ను వసూలు మొత్తం రూ.9.51 లక్షల కోట్లు. కాగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ మధ్య కాలంలో పన్ను రిఫండ్స్ మొత్తం రూ.2.31 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 46 శాతం అధికం. స్థూల ప్రాతిపదికన ప్రత్యక్ష పన్ను వసూళ్లు 22.3 శాతం పెరిగి రూ.13.57 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో వ్యక్తిగత ఐటీ వసూలు రూ.7.13 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూలు రూ.6.11 లక్షల కోట్లుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల రూపంలో మొత్తం రూ.22.07 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది ప్రభుత్వం బడ్జెట్లో నిర్దేశించిన లక్ష్యం.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

న్యూఢిల్లీ: విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు అక్టోబరు 4తో ముగిసిన వారంలో 370.9 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 70,117.60 వద్ద స్థిరపడ్డాయని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. అంతకు ముందు వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.50 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే వారంలో బంగారం నిల్వలు 4 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 6,575.6 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▲	70,950 ▲	1,02,000 ▲
ముంబై	75,623 ▲	69,271 ▲	89,963 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	114	విజయవాడ	125
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	126
కర్నూలు	114	నెల్లూరు	126
విశాఖపట్నం	120	అనంతపురం	126
గోదావరి	125		

రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటా

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక

- వెంటనే అమల్లోకి వచ్చిన నియామకం
- రతన్ టాటా సవతి సోదరుడే నోయల్
- నలభై ఏళ్లకుపైగా టాటా గ్రూప్‌తో అనుబంధం



ముంబై: టాటా గ్రూప్‌లో వారసత్వ పగ్గాల బదిలీ ప్రశాంతంగా జరుగుతోంది. టాటా ట్రస్ట్స్ కొత్త చైర్మన్‌గా రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా (67) నియమితులయ్యారు. ముంబైలో శుక్రవారం జరిగిన టాటా ట్రస్ట్స్ ట్రస్టీల సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ట్రస్టులకు టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉంది. దాదాపు ఈ ట్రస్టులన్నిటిలో నోయల్ టాటా ఇప్పటికే ట్రస్టీగా ఉన్నారు. కొత్త చైర్మన్‌గా నోయల్ టాటా నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని టాటా ట్రస్ట్స్ ఒక ప్రకటనలో తెలిపింది. 'రతన్ టాటా, టాటా గ్రూప్ వ్యవస్థాపకుల వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఎదురు చూస్తున్నా' అంటూ ఈ ప్రకటన వెలువడిన వెంటనే నోయల్ టాటా ట్వీట్ చేశారు.

2012లోనే తెరపైకి పేరు

ప్రచారానికి దూరంగా ఉండే నోయల్ టాటా పేరు నిజానికి 2012లోనే రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ చైర్మన్‌గా తెరపైకి వచ్చింది. అయితే అప్పట్లో ఆయన తన బావమరిది సైరస్ మిస్త్రీకి ఈ పదవి కట్టబెట్టేందుకు వీలుగా ఆ పదవిపై పెద్దగా ఆసక్తి చూపలేదంటారు. ఇప్పుడు రతన్ టాటా, సైరస్ మిస్త్రీ ఇద్దరూ లేకపోవడంతో ఇక టాటా గ్రూప్ సారథ్యం స్వీకరించేందుకు నోయల్ టాటా కాదనలేదని సమాచారం.

టాటాల మనిషే

రతన్ టాటా సవతి సోదరుడైన నోయల్ టాటాకు.. టాటా గ్రూప్‌తో నలభై ఏళ్లకుపైగా అనుబంధం ఉంది. టాటా గ్రూప్ రిటైల్ కంపెనీ 'ట్రెంట్' బహుముఖ విస్తరణలో నోయల్ టాటాది కీలక పాత్ర. 1998లో ఒక స్టోర్‌తో ప్రారంభించి వివిధ ఫార్మాట్లలో ఆ సంస్థను 700కుపైగా స్టోర్లకు విస్తరించారు. వెస్ట్‌సైడ్, జుడియో, క్రోమాతో పాటు ఇటీవల టాటాల గూటికి చేరిన బిగ్ బాస్కెట్ వంటి కంపెనీలన్నీ ట్రెంట్ గొడుకు కిందే పనిచేస్తాయి. లిస్టెడ్ కంపెనీ అయిన ట్రెంట్ ప్రస్తుత మార్కెట్ క్యాప్ రూ.1.81 లక్షల కోట్ల వరకు ఉంది. ఇదిగాక టాటా గ్రూప్ కంపెనీలైన వోల్టాస్, టాటా ఇంటర్నేషనల్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ వంటి అనేక టాటా గ్రూప్ కంపెనీలకూ నోయల్ చైర్మన్‌గా ఉన్నారు. వీటికి తోడు టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ చైర్మన్‌గానూ నోయల్ టాటా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

నావెల్ హెచ్ టాటా.. నోయల్ టాటా తండ్రి. తల్లి సిమోన్ హెచ్ టాటా స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యాపారవేత్త. సిమోన్ హెచ్ టాటా కంటే ముందే నావెల్ హెచ్ టాటా రతన్ టాటా తల్లి సూనూ కమిశారియట్‌ను వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లి ద్వారా నావెల్ హెచ్ టాటాకు రతన్, జిమ్మీ జన్మించారు. ఈ ముగ్గురు అన్నదమ్ముల్లో నోయల్ టాటా మాత్రమే వివాహితుడు. రతన్ టాటా, జిమ్మీ టాటా అవివాహితులు. నోయల్ టాటా భార్య ఆలూ మిస్త్రీ.. రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ పగ్గాలు చేపట్టిన సైరస్ మిస్త్రీకి స్వయానా సోదరి. షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ అధినేత పల్లోంజీ మిస్త్రీ కుమార్తె.

షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. అంతేకాదు టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద ప్రైవేట్ వాటాదారుగా ఉంది. నోయల్ టాటా-ఆలూ మిస్త్రీ దంపతులకు లీ, మాయ అనే కుమార్తెలతో పాటు నెవిల్లే అనే ఒక కుమారుడు ఉన్నారు. ఇందులో లీ టాటా.. ప్రస్తుతం తాజ్ హోటల్స్‌ను నిర్వహించే ది ఇండియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాయా టాటా క్యాపిటల్ కంపెనీలో ఉన్నత స్థానాల్లో పని చేస్తున్నారు. కుమారుడు నెవిల్లే కూడా ట్రెంట్, స్టార్ బజార్ సారథ్య బాధ్యతలు చూసుకుంటున్నారు.

పారిశ్రామికం నేలచూపు

న్యూఢిల్లీ: సుమారు రెండు సంవత్సరాల అనంతరం దేశంలో పారిశ్రామికోత్పత్తి ఆగస్టు నెలలో తొలిసారిగా ప్రతికూల వృద్ధిలో ప్రవేశించింది. మైనింగ్, విద్యుదుత్పత్తి రంగాల ఉత్పత్తి క్షీణత కారణంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గత ఏడాది ఆగస్టుతో పోల్చితే మైనస్ 0.1 శాతానికి దిగజారింది. జూలై నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును కూడా 4.8 శాతం నుంచి 4.7 శాతానికి కుదించారు. గత ఏడాది ఆగస్టులో ఐఐపీ వృద్ధి రేటు 10.9 శాతం ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 6.2 శాతంగా ఉంది. ఈ ఆగస్టులో మైనింగ్ రంగం మైనస్ 4.3 శాతం, తయారీ రంగం 0.1 శాతం, విద్యుత్ రంగం మైనస్ 3.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2022 అక్టోబరులో నమోదైన 4.1 శాతం ప్రతికూల వృద్ధి తర్వాత ఐఐపీ నెగిటివ్ జోన్‌లోకి రావడం ఇదే ప్రథమం.

అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లో మార్కెట్

ముంబై: పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడడానికి ముందు ఇన్వెస్టర్లలో నెలకొన్న అప్రమత్తత, అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. కొద్ది రోజులుగా విదేశీ నిధులు తరలిపోతూ ఉండడం, రూపాయి బలహీనత, ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బ్యాంకింగ్, యుటిలిటీ, ఫైనాన్షియల్ విభాగాల షేర్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలు సాగించారు. అయితే మెటల్ విభాగం షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగడంతో నష్టాలు కొంత మేరకు పరిమితం అయ్యాయి. మొత్తం మీద ఆటుపోట్లతో సాగిన పయనంలో సెన్సెక్స్ 230.05 పాయింట్ల నష్టంతో 81381.36 వద్ద ముగియగా నిఫ్టీ 34.20 పాయింట్ల నష్టంతో 24,964.25 వద్ద ముగిసింది. మార్కెట్‌ను ఉత్తేజపరిచే వార్తలేవీ లేకపోవడం వల్ల ట్రేడింగ్ పూర్తిగా సైడ్‌వేస్ ధోరణిలో సాగిందని విశ్లేషకులంటున్నారు.

ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్‌పై సెబీ దర్యాప్తు: ఎస్ఎంఈ విభాగంలోని ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ షేర్ల లిస్టింగ్‌ను నిలిపివేయాలని బీఎస్ఈని సెబీ ఆదేశించింది. ఐపీఓకు అనుమతి కోరుతూ సమర్పించిన దరఖాస్తులో సంస్థ చేసినట్టు చెబుతున్న తప్పుడు ప్రకటనలపై సవివరమైన దర్యాప్తు చేపట్టాలని సెబీ నిర్ణయించింది. ఈ దర్యాప్తు 30 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సెబీ గడువు పెట్టింది. ఆ సంస్థ ఐపీఓ ద్వారా సేకరించిన సొమ్మును వడ్డీ ఆర్జించే ఎస్క్రో ఖాతాలో భద్రపరచాలని బీఎస్ఈకి సూచించింది. ఎస్ఎంఈ వేదిక ద్వారా కంపెనీ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసిన 30 రోజుల అనంతరం సెబీ నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రూ.66-70 ధరల శ్రేణిలో జారీ అయిన ఈ ఐపీఓకి 345 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.45 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా రూ.10,000 కోట్లకు పైబడిన బిడ్లు దాఖలయ్యాయి.

- బర్నర్స్ తయారీ కంపెనీ మయూఖ్ డీల్ ట్రేడ్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49 కోట్లు సమీకరించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. అలాగే రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరును రూ.1 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా విభజించేందుకు కూడా బోర్డు ఆమోదం లభించిందని వెల్లడించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ కుదేలవుతోంది. శుక్రవారం మరో 12 పైసలు నష్టపోయి రూ.84.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. శుక్రవారం ఉదయం గురువారంతో పోలిస్తే ఒక పైసా నష్టంతో రూ.83.97 వద్ద కొద్దిగా మెరుగ్గానే ప్రారంభమైనా ఇంట్రాడేలో రూ.83.96-84.10 మధ్య ట్రేడైంది. చివరికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.84.10 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మండుతున్న చమురు ధర ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

టయోటా కిర్లోస్కర్ కొత్త అర్బన్ క్రూయిజర్ హైరైడర్



బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మార్కెట్లోకి ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ను విడుదల చేసింది. ప్రీమియం యాక్సెసరీస్ ప్యాకేజీ, స్పోర్టీనెస్, మరింత కంఫర్ట్‌తో దీన్ని తీసుకువచ్చింది. జీ, వీ వేరియంట్స్‌తో హైబ్రిడ్, నియో డ్రైవ్ పవర్‌ట్రెయిన్స్‌తో ఇది అందుబాటులో ఉండనుంది. దేశవ్యాప్తంగా ఉన్న టయోటా డీలర్‌షిప్ కేంద్రాల్లో సమగ్ర ప్యాకేజీతో ఈ అర్బన్ క్రూయిజర్ అందుబాటులో ఉంటుందని టీకేఎం వెల్లడించింది.

- జేఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జేఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా ఏలూరులో కంపెనీ కొత్త శాఖను ప్రారంభించింది. జేఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్‌కు రాష్ట్రంలో ఇది 10వ శాఖ. ఈ కొత్త శాఖ ఏర్పాటుతో దేశవ్యాప్తంగా మొత్తం బ్రాంచీల సంఖ్య 126కి చేరింది.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అల్ట్రావయోలెట్.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో తొలి యూవీ స్పేస్ స్టేషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌లో 10.3 కిలోవాట్ ఎస్ఆర్‌బీ7 లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఎఫ్77 మాక్ 2 ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ అందుబాటులో ఉంటాయి.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ వారివో మోటార్ ఇండియా.. బ్యాటరీ స్మార్ట్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా బీ2బీ ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీని బ్యాటరీ స్మార్ట్ అందించనుంది. వచ్చే ఏడాది చివరి నాటికి బీ2బీ విభాగంలో 20 వేల స్కూటర్లను విక్రయించాలని వారివో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీ స్వాపింగ్ సేవలను అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని వారివో భావిస్తోంది.

స్పోర్ట్స్



టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డీఎస్పీగా విధుల్లో చేరాడు. శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలోనే మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందించాడు. రాష్ట్ర కేబినెట్ తీర్మానం మేరకు నిబంధనలను సడలించి, ప్రత్యేక జీవో విడుదల చేసి సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.



ఆస్ట్రేలియా హ్యాట్రిక్

9 వికెట్లతో పాకిస్థాన్‌పై గెలుపు

మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్‌లో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తద్వారా గ్రూప్ టాపర్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంతో సెమీఫైనల్ స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. మొదట పాకిస్థాన్ 19.5 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. అలియా రియాజ్ (26), సిద్రా అమీన్ (12), ఇరామ్ జావెద్ (12) మోస్తరుగా ఆడారు. గార్డెనర్ నాలుగు, సదర్లాండ్, వేరామ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11 ఓవర్లలో 83/1 స్కోరుతో ఛేదించింది. కెప్టెన్ హీలీ (37 రిటైర్డ్ హర్ట్), ఎలీస్ పెర్రీ (22 నాటౌట్) మెరిశారు. గార్డెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్‌ను ఆస్ట్రేలియా ఢీకొననుంది.

సంక్షిప్త స్కోర్లు: పాకిస్థాన్: 19.5 ఓవర్లలో 82 ఆలౌట్ (అలియా రియాజ్ 26, సిద్రా అమీన్ 12, ఇరామ్ జావెద్ 12, గార్డెనర్ 4/21, సదర్లాండ్ 2/15, వేరామ్ 2/16); **ఆస్ట్రేలియా:** 11 ఓవర్లలో 83/1 (హీలీ 37 రిటైర్డ్ హర్ట్, ఎలీస్ పెర్రీ 22 నాటౌట్, గార్డెనర్ 7 నాటౌట్, సాదియా ఇక్బాల్ 1/17).

ఫైనల్లో అలాస్కన్‌తో త్రివేణి ఢీ

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ ఫైనల్లో టేబుల్ టాపర్ పీబీజీ అలాస్కన్ నైట్స్‌తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో త్రివేణి 9-7తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో అలాస్కన్ నైట్స్ 14-5తో అమెరికన్ గ్యాంబిట్స్‌పై, గ్యాంజీస్ గ్రాండ్‌మాస్టర్స్ 12-4తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గాయి. లీగ్ దశ ముగిసేసరికి అలాస్కన్ 114 పాయింట్లతో టాప్‌లో నిలవగా, త్రివేణి 99 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శనివారం ఫైనల్ జరగనుంది.

మ్యాచ్ రా. 7 గం.నుంచి స్పోర్ట్స్ 18లో...

టార్గెట్.. క్లీన్‌స్వీప్

టీమిండియాలో మార్పులు ? బంగ్లాతో నేడు ఆఖరి టీ20

ఉప్పల్ వేదికగా పోరు



ఉప్పల్ మైదానంలో పిచ్‌ని పరిశీలిస్తున్న కెప్టెన్ సూర్యకుమార్

హైదరాబాద్: తొలి రెండు టీ20ల్లో ఏకపక్ష విజయాలు సాధించిన భారత్..బంగ్లాదేశ్‌తో ఆఖరి మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించడం ద్వారా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. రెండు జట్ల మధ్య మూడో, చివరి మ్యాచ్ శనివారం ఇక్కడ జరగనుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో గెలుపొంది వెటరన్ మహ్మదుల్లాకు విజయంతో వీడ్కోలునివ్వాలని బంగ్లాదేశ్ పట్టుదలగా ఉంది. సిరీస్‌ను టీమిండియా ఇప్పటికే సొంతం చేసుకున్న నేపథ్యంలో రిజర్వ్ ఆటగాళ్లను పరిశీలించే అవకాశముంది. దాంతో లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాల్లో ఒకరిద్దరికి స్థానం దక్కవచ్చు. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అంచనాలను అందుకోలేకపోయారు. మొదటి టీ20లో ఇద్దరూ తక్కువ స్కోర్లకే అవుట్‌కాగా..ఢిల్లీ మ్యాచ్‌లో చక్కటి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇక..తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌పై మరోసారి అందరి దృష్టి నిలిచింది. రెండో టీ20లో బంగ్లాదేశ్ బౌలర్లను ఎడాపెడా బాదేసిన నితీశ్..బౌలింగ్‌లోనూ రాణించి రెండు వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘకాలం తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండు మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటాడు. స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ 150 కి.మీ.లకుపైగా వేగంతో ఆకట్టుకున్నాడు. 38 ఏళ్ల బంగ్లా వెటరన్ ఆటగాడు మహ్మదుల్లా ఆఖరి టీ20 మ్యాచ్ ఆడబోతున్నాడు. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లంతా విఫలమైన వేళ..మహ్మదుల్లా (41)నే చెప్పుకోతగ్గ స్కోరు చేయడం గమనార్హం. మరి..విజయంతో అతడికి వీడ్కోలు పలకాలంటే బంగ్లాదేశ్ బ్యాటర్లతోపాటు బౌలర్లు అద్భుతంగా రాణించక తప్పదు.



షంటో

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, రింకూ సింగ్, హార్దిక్, పరాగ్, సుందర్, వరుణ్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్/హర్షిత్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), పర్వేజ్, లిట్టన్ (కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, మెహ్దీహసన్, మెహ్దీహసన్ మిరాజ్, రిషద్, టస్కిన్, తన్జిమ్ సకీబ్, ముస్తాఫిజుర్

పిచ్: ఈ పిచ్‌పై 2024 ఐపీఎల్‌లో మూడు జట్లు తొలుత బ్యాటింగ్ చేసి 200లకుపైగా పరుగులు చేసి గెలుపొందాయి. అంటే..పరుగుల వరద ఖాయమన్నమాట.

వాతావరణం..

గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో సాయంత్రం వేళ వర్షం కురుస్తోంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పాల్సి వచ్చింది. దాంతో బంగ్లాదేశ్ జట్టు ప్రాక్టీస్‌కు అంతరాయం కలిగింది. శనివారం ఉదయం వర్షం కురిసే అవకాశం 40 శాతం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే మ్యాచ్ సమయంలో వర్షానికి లేకపోయినా, ఆకాశం మేఘావృతమై ఉంటుందని సమాచారం.

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు

న్యూజిలాండ్ X శ్రీలంక	మ. 3.30
బంగ్లాదేశ్ X దక్షిణాఫ్రికా	రా. 7.30

కివీస్‌తో టెస్టులకు రోహిత్ సేన ఇదే..

రిజర్వ్ ఆటగాడిగా నితీశ్



ముంబై: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ సారథ్యంలోని ఈ జట్టుకు బుమ్రాను వైస్‌కెప్టెన్‌గా నియమించారు. ఈనెల 16న బెంగళూరులో జరిగే తొలి టెస్టుతో ఈ సిరీస్ ఆరంభమవనుంది.

జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్),బుమ్రా (వైస్ కెప్టెన్)యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ (వికెట్‌కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాష్‌దీప్; **రిజర్వ్ ప్లేయర్లు:** నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

సెమీస్‌లో రష్మిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ మైసూర్ ఓపెన్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లో ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో శ్రీవల్లి 6-2, 6-2తో భారత్‌కే చెందిన ఆకాంక్షపై నెగ్గి టైటిల్‌కు చేరువైంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-1, 6-3తో తనీషా కశ్యప్‌పై గెలుపొందింది.

చెలరేగిన ఆంధ్ర బౌలర్లు

విదర్భ 118 ఆలౌట్



శశికాంత్ (3/31)

నాగ్‌పూర్: ఆంధ్ర పేస్ బౌలర్లు చెలరేగడంతో రంజీ సీజన్ తొలి మ్యాచ్‌లో విదర్భ జట్టు కుప్పకూలింది. సొంతగడ్డపై శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. పిచ్‌ని సరిగా అంచనా వేయలేక తొలి ఇన్నింగ్స్‌లో 38.5 ఓవర్లలో కేవలం 118 పరుగులకే ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (46 నాటౌట్) మినహా అందరూ విఫలమయ్యారు. ఆంధ్ర పేసర్లు శశికాంత్ (3/31), స్టీఫెన్ (2/43), సత్యనారాయణ రాజు (2/26)తోపాటు స్పిన్నర్ లలిత్ మోహన్ (2/18) అదరగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్ర జట్టు 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (62 నాటౌట్), షేక్ రషీద్ (49 నాటౌట్) క్రీజులో ఉన్నారు. హనుమ విహారి (1) విఫలమయ్యాడు.

పాక్‌కు ఘోర పరాభవం

ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం



జాక్ లీచ్ (4/30)

ముల్తాన్: టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోర పరాజయాన్ని పాకిస్థాన్ జట్టు మూటగట్టుకుంది. శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 152/6తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 220 పరుగులకు ఆలౌటైంది. 11వ నెంబర్ ఆటగాడు అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు దిగలేదు. సల్మాన్ ఆగా (63), ఆమెర్ జమాల్ (55 నాటౌట్) రాణించారు. ఐదోరోజు పతనమైన మూడు వికెట్లనూ జాక్ లీచ్ సాధించాడు. మొత్తంగా లీచ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. కాగా 147 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో మొదటి ఇన్నింగ్స్‌లో 500కుపైగా పరుగులు సాధించి..ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైన తొలి జట్టుగా పాక్ అపఖ్యాతిని మూటగట్టుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ 556, ఇంగ్లండ్ 7 వికెట్లకు 823 (డిక్లేర్డ్) పరుగులు చేశాయి. కాగా 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ పాకిస్థాన్ జట్టుకు సొంతగడ్డపై విజయం దక్కలేదు. అప్పటినుంచి 11 టెస్టులాడి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది.

దేవర 2లో రణ్‌బీర్, రణ్‌వీర్?



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవర' చిత్రం ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా రాబోతున్న 'దేవర 2' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలను కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'దేవర' చిత్రంలో విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్, కథానాయికగా జాన్వీకపూర్ నటించారు. వీరితో పాటు రెండో భాగంలో మరికొందరు బాలీవుడ్ తారలు భాగమవనున్నారని ఆయన చెప్పారు. 'దేవర 2'లో కొన్ని అతిథి పాత్రలు ఉన్నాయి. అవి కథలో చాలా కీలకంగా ఉంటాయి. రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్‌కపూర్ లాంటి బాలీవుడ్ స్టార్స్ ఆ పాత్రల్లో నటిస్తే బాగుంటుందని నాకు అనిపిస్తోంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. జరుగుతుందో లేదో తెలియదు కాబట్టి ఇప్పుడే దీని గురించి నేను ఎక్కువ మాట్లాడకూడదు. కొంతమంది తెలుగు, తమిళ హీరోలు అయినా ఆ పాత్రలు పోషిస్తే బావుంటుంది. వారి పేర్లు చెబితే ఇప్పటి నుంచే ఊహాగానాలు మొదలవుతాయి కాబట్టి చెప్పడం లేదు. త్వరలోనే వివరాలు ప్రకటిస్తాం' అన్నారు.



వశిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సెట్స్‌లో సందడి నెలకొంది. శుక్రవారం వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మూవీ సెట్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవితో కలసి వెంకటేశ్, అనిల్ రావిపూడి, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ దిగిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజకీయాల్లోకి సాయాజీ షిండే



వెండితెరపై విలన్, కమెడియన్ పాత్రల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠా నటుడు సాయాజీషిండే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)లో చేరారు. అజిత్‌పవార్ స్వయంగా కండువా కప్పి సాయాజీ షిండేను పార్టీలోకి ఆహ్వానించారు. అజిత్‌పవార్ పనితీరు నచ్చి ఎన్సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు షిండే తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ తరపున ప్రచారం చేయడంతో పాటు సాయాజీ షిండే ఎమ్మెల్యేగా బరిలో నిలవనున్నారని సమాచారం.

రేసర్‌గా నిఖిల్



సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, రుక్మిణీ వసంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తునారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో నిఖిల్ రిషి అనే పాత్రలో రేసర్‌గా కనిపించనున్నారు. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. హర్ష చెముడు, దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్.

మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నా



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్‌ను కథానాయిక రష్మిక మందన్న పొగడ్తలతో ముంచెత్తారు. శుక్రవారం అలియా నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. ప్రత్యేక ప్రదర్శనకు రష్మిక హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అలియా కథల ఎంపిక అద్భుతంగా ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక మెచ్చుకున్నారు. 'అలియా నువ్వు మాకు దొరకడం ఓ వరం. నటిగా నీలోని ప్రతిభను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇలానే మరెన్నో గొప్ప చిత్రాల్లో ప్రేక్షకులను అలరించాలి' అని ఆకాంక్షించారు.

గొప్ప చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ నెల 31 సినిమా విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్ర దర్శకుడు, నిర్మాత మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "త్వరలోనే సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ మధ్య కాలంలో తెరకెక్కిన గొప్ప చిత్రాలలో ఇది ఒకటిగా నిలుస్తుంది. విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం" అని చెప్పారు. "ఇది 1980-90ల కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసుకున్న కల్పిత కథ. ఇప్పటిదాకా నేను తీసిన సినిమాల్లో ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుంది. సినిమా సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

టమోటా కిలో రూ.50

అనంతపురం రూరల్, అక్టోబరు 11: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 950 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు ఆయన తెలిపారు.

18 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 11: జిల్లాలోని 18 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 55.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కణేకల్లు 37.0, బెళుగుప్ప 34.6, డి. హీరేహాళ్ 33.0, బ్రహ్మసముద్రం 32.0, రాయదుర్గం 30.6, గుమ్మఘట్ట 26.8, కళ్యాణదుర్గం 26.4, బొమ్మనహాళ్ 20.2, కూడేరు 10.0, కంబదూరు 8.2, ఉరవకొండ 6.8, అనంతపురం 4.2, యాడికి 3.4, గుంతకల్లు 2.2, విడపనకల్లు 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రానున్న మూడు రోజులకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, అక్టోబరు 11: ఉమ్మడి జిల్లాకు రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

15 నుంచి సీపీఎం బస్సుయాత్ర

అనంతపురం కల్చరల్, అక్టోబరు 11: జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారం కోసం బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు ఈ యాత్ర జరుగుతుందన్నారు. ఎగువన తుంగభద్ర డ్యాం, దిగువన శ్రీశైలం డ్యాం పూర్తిగా నిండినా జిల్లాకు రావాల్సిన నీరు తెచ్చుకోలేని దుస్థితి ఉందన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ చేపట్టి 14 సంవత్సరాలయినా ఇంతవరకూ పని పూర్తికాలేదన్నారు. హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరందించేందుకు పంటకాల్వలు వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులకు నీరందించాలని, రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకోసం ఈనెల 15న బొమ్మనహాళ్‌లో బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. 27 మండలాలు, 100 గ్రామాలమీదుగా యాత్ర జరుగుతుందన్నారు. 21న కలెక్టరేట్ వరకు యాత్ర చేరుకుని, అక్కడే మహా ధర్నా చేపడతామన్నారు.









రైలు పొడిగింపు

కాచిగూడ-మంగళూరు రైలు మురడేశ్వర్ వరకూ ..

గుంతకల్లు, అక్టోబరు11: గుత్తి మీదుగా వెళ్లే కాచిగూడ- మురడేశ్వర్-కాచిగూడ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (12789/90) రైలును మురడేశ్వర్ వరకూ పొడిగించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-మంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 11 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు గమ్యాన్ని 12వ తేదీ నుంచి పొడిగించినట్లు వివరించారు. ఈ రైలు మంగళూరు తర్వాత సూరత్కల్, ముల్కి, ఉడిపి, బర్కూర్, కుండపుర, మూకాంబికా నగర్ బైందూరు, భత్కల్ స్టేషన్ల మీదుగా మురడేశ్వర్‌కు చేరుకుంటుందన్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ నియంత్రణ కోసం గుంతకల్లు మీదుగా బెళగావి-మణుగూరు-బెళగావి మధ్య వచ్చే సంవత్సరం మార్చి ఆఖరు వరకూ వారానికి నాలుగు రోజులు నడిచే ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెళగావి-మణుగూరు ప్రత్యేక రైలు (నెం. 07335)ను ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం మార్చి 30వ తేదీ వరకూ 95 సర్వీసులు నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు ఆది, మంగళ, బుధ, శని, మంగళ వారాలలో బెళగావిలో మధ్యాహ్నం 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12-50 గంటలకు మంగుూరుకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07336) ఈ నెల 17 నుంచి వచ్చే నెల మార్చి 31వ తేదీ వరకూ సోమ, బుధ, గురు, ఆది వారాలలో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు మణుగూరులో మధ్యాహ్నం 3-40 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 4 గంటలకు బెళగావికి చేరుతుందన్నారు. ఈ రైళ్లు ఖానాపూర్, లోండా, అల్నావర్, ధార్వార్, హుబ్లీ, గదగ్, గొప్పల్, హోస్పేట, తోరణగల్లు, ధరోజీ, బళ్లారి, గుంతకల్లు, ఆదోని, కోసిగి, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, చిట్టాపూర్, మల్ఖెడ్ రోడ్డు, సేరం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్లు, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్లు, గాంధీపురం రోడ్డు స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు.

వైసీపీలో కొందరిని వదిలేదే లేదు..

తాడిపత్రి, అక్టోబరు11: వైసీపీలో ఉన్న అందరితో తమకు పనిలేదని, 10 నుంచి 15 మందిని మాత్రం వదిలిపెట్టేదిలేదని టీడీపీ ఎస్సీసెల్ జనరల్ సెక్రటరీ కొత్తపల్లి మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక జేసీ నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపైకి వచ్చిన సంగతి మరిచావా అని ప్రశ్నించారు. తమ పార్టీ నాయకుడు నేత పొట్టిరవిని ఐదేళ్లు ఊరిలోకి రానీయకుండా అడ్డుకున్నప్పుడు లా అండ్ ఆర్డర్ ఏమైందని సూటిగా ప్రశ్నించారు. చివరికి వికలాంగుడు దాసరి కిరణ్‌ను కొట్టిన ఘనత నీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు11: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని నవంబరు మొదటి వారం వరకూ జల్నా-తిరుపతి-జల్నా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నం. 07621/22) రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. జల్నా-తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 13, 20, 27, నవంబరు 3న (ఆదివారాలు) జల్నాలో సాయంత్రం 7-10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం ఆరున్నరకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఈ నెల 14, 21, 28, నవంబరు 4న (సోమవారాలు) తిరుపతిలో రాత్రి 9-10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 7 గంటలకు జల్నాకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పార్భూరు, సేలు, మన్వత్ రోడ్డు, బర్బని, గంగాఖేర్, పర్లి, వైజనాథ్, లాతూరు రోడ్డు, ఉద్గిర్, భల్కి, బీదర్, జహీరాబాద్, వికారాబాద్, తాండూరు, సేరం, చిట్టాపూర్, యాద్గిర్, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్ల మీదుగా తిరుపతికి చేరుకుంటుందని వివరించారు.

అప్రమత్తంగా ఉండాలి..

పుట్టపర్తి, అక్టోబరు 11: రానున్న మూడు రోజుల పాటు శ్రీసత్యసాయి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న శాస్త్రవేత్తల సూచనల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని లోతట్టుప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

దసరా శుభాకాంక్షలు

శ్రీ సత్యసాయిజిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా ప్రజలు, అధికారులకు దసరా శుభాకాంక్షలను శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో విజయ దశమి వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.













14న మద్యం షాపులకు లాటరీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 11: ప్రైవేటు మద్యం షాపుల నిర్వహణ కోసం ఈనెల 14న జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో లాటరీ తీయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో లాటరీ నిర్వహించాలని నిర్ణయించినా, అక్కడ ఆరోజు ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమం ఉన్నందున లాటరీ నిర్వహణ స్థలాన్ని మార్పు చేసినట్లు వెల్లడించారు. ఈనెల 14న ఉదయం 7 గంటల నుంచే లాటరీ తీయడం ప్రారంభిస్తామన్నారు. లాటరీ సమయంలో జేఎన్‌టీయూ వద్ద పటిష్ఠ పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఈనెల 16న మద్యం షాపులు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్.. జిల్లా జట్టు



విజేత ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు

హిందూపురం, అక్టోబరు 11: జిల్లా ఫుట్‌బాల్ జట్టు సత్తాచాటింది. రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా అవతరించింది. ఈనెల 8నుంచి 11వతేదీ వరకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు గుంటూరులో నిర్వహించినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జీవీ అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల జట్లు పాల్గొన్నాయన్నారు. ఫైనల్లో గురువారం కర్నూలు జట్టుతో జిల్లా జట్టు తలపడింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో జిల్లా జట్టు గెలుపొంది, చాంపియన్‌గా అవతరించిందని జిల్లా సంఘం అధ్యక్షుడు తెలిపారు.









జయ జయహే మహిషాసురమర్దిని..






మహిషాసురమర్దినిగా హిందూపురంలో కొల్లాపురలక్ష్మి, ముద్దిరెడ్డిపల్లిలో చౌడేశ్వరీదేవి, పెనుకొండలో కన్యకాపరమేశ్వరి, లేపాక్షిలో మహచండీ అలంకరణలో దుర్గాదేవి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు అమ్మవారి ఆలయాలు శోభాయమానంగా వర్ధిల్లాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక రోజు కావడంతో ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం అభిషేకాలు అర్చనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలతో దర్శనమిచ్చారు. హిందూపురం పట్టణంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత భగవతిదేవి అమ్మగా కొలువుదీరారు. కొల్లాపురి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహిషాశురమర్దినిగా తీర్చిదిద్దారు. సాధుచెట్టి సంఘం ఆధ్వర్యంలో జలదుర్గమ్మను దానిమ్మ గింజలతో మహిషాశురమర్దినిగా రూపుదిద్దుకున్నారు. యల్లమ్మ ఆలయంలో దుర్గాదేవిగా ముస్తాబు చేశారు. లేపాక్షి ఆలయంలో మహాచండీ అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా వీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెనుకొండలోని లక్ష్మీనరసింహస్వామి కొండపై వెలసిన భైరవ కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిశాశురమర్ధిని రూపంలో అలంకరించారు. చంద్రగిరిలో శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠం మహేశ్వరిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. పీఠాధిపతి దేవంద్రస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలమత్తూరు మండలంలోని ఏటి గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిసాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. మడకశిర పట్టణంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో కొలువు దీరారు. వడిసిలమ్మ, కొల్లాపురమ్మ, మూలకంఠేశ్వరీ, గంగాహుజమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెరువులు, కుంటలకు జలకళ

మడకశిర ప్రాంతంలో భారీ వర్షాలు




హనిసేకుంట వద్ద ప్రవహిస్తున్న చెక్‌డ్యాం, కెంకెర వద్ద చెరువుకు చేరిన నీరు

మడకశిరటౌన్, అక్టోబరు 11: నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు పుష్కలంగా కురుస్తుండడంతో చెక్‌డ్యాంలు, చిన్న చిన్న చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 65.4 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. రొళ్ల మండలంలో 60.4 మి.మీ., గుడిబండ మండలంలో 41 మి.మీ., మడకశిర మండలంలో 15.2 మి.మీ., అగళిలో 6.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో చెక్‌డ్యాంలు, చెరువులకు నీరు చేరుతోంది. రొళ్ల మండలంలో హనిసేకుంట, మల్లినమడుగు, అగ్రహారం తదితర ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నీటితో కళ కళలాడుతున్నాయి. హనిసేకుంట చెరువుకు సైతం నీరు పుష్కలంగా చేరింది. అమరాపురం మండలంలో హేమావతి, కెంకెర తదితర చెరువులు నిండి మరువ పారాయి. మడకశిర చెరువు, గౌడనహళ్లి, కల్లుమర్రి తదితర చెరువులకు నీరు చేరాయి. గంగులవాయిపాళ్యం చెక్‌డ్యాం నీటితో నిండి ప్రవహిస్తోంది. రొళ్ల మండలంలో అగ్రహారం వద్ద ఉన్న ఉప్పవంక వారం రోజుల నుంచి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాఘవేంద్రస్వామి సేవలో బీకే దంపతులు

పెనుకొండ, అక్టోబరు 11: దసరా పండగ సందర్భంగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి దంపతులు మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.



రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద బీకే దంపతులు

చందకచర్లలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి తదితరులు

మడకశిర రూరల్, అక్టోబరు 11: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చందకచర్ల గ్రామంలో వెలసిన గంగమ్మదేవత ఆలయంతో శుక్రవారం చండీహోమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అమ్మవారి చండీహోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

అల్లికెరలో తాగునీటి సమస్య పరిష్కారం

అగళి, అక్టోబరు 11 : మండలంలోని హళ్లికెర ఇంద్రమ్మ కాలనీలో బోరుబావి తవ్వడంతో పుష్కలంగా నీరు లభించినట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి విన్నవించడంతో స్పందించి బోరు వేయించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో 760 అడుగులు బోరువేయగా నీరుపుష్కలంగా లభించిందని గ్రామస్థులు తెలిపారు.



పుష్కలంగా పడిన నీరు

రోడ్డుపైనే మురుగు నీరు

అమరాపురం, అక్టోబరు 11 : మండలంలోని కె.శివరం గ్రామంలో వర్షాకాలం వచ్చిందంటే మురిగు నీరు రోడ్డుపైకి చేరుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేచోటికి చేరడంతోపాటు చెత్తాచెదారం పడి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ కాలనీలో విపరీతంగా దోమలు ప్రబలి, విషజ్వరాలు రావడానికి ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో దాదాపుగా 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. వర్షం వస్తే ఆ కాలనీలో తిరగడానికి కూడా వీలు లేకుండా ఉందని నీటి కుంటను తలపిస్తోందని అన్నారు. ముసలివారు, బాలింతలు రోడ్డు కూడా దాటడం కష్టంగా ఉందని వాపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది ప్రజా ప్రతినిధులు మారినా తమ ఎస్సీ కాలనీ రూపురేఖలు మాత్రం మారలేదని కాలనీ వాసులు అంటున్నారు. ఎన్ని అర్జీలు ఇచ్చినా సర్పంచుకానీ పంచాయతీ కార్యదర్శికానీ తమ బాధను పట్టించుకోలేదని తెలిపారు.



రోడ్డుపైనే నిలిచిన మురుగునీరు

ముగిసిన దరఖాస్తుల పర్వం

పెనుకొండ/మడకశిర అక్టోబరు 11 : మద్యం దుకాణాల దరఖాస్తులకు శుక్రవారంతో గుడువు ముగిసింది. పెనుకొండ ఎక్సైజ్ పరిధిలో నాలుగు మండలాల్లో 13 మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. ఒక్కరోజే 43 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు. మడకశిర నియోజకవర్గంలోని 10 మద్యం దుకాణాలకు 160 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు. చివరిరోజు 63 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రారంభంలో దరఖాస్తులు రాని షాపులకు కూడా చివరి రెండు రోజుల్లో వచ్చాయన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, అక్టోబరు 11: మండలంలోని దిగువ గంగంపల్లికి చెందిన మనోజ్‌కుమార్ అనే యువకుడు శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మనోజ్‌కుమార్‌ను తండ్రి సూర్యనారాయణ మందలించడంతో మనస్థాపానికి గురై విషద్రావకం సేవించి అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన స్నేహితులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

పార్టీని పటిష్టం చేస్తాం

హిందూపురం, అక్టోబరు 11: కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేస్తామని జిల్లా అధ్యక్షుడు ఇనాయతుల్లా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ మతాలు, భాషలు, ప్రాంతాల్లో సమన్వయం చేసుకుని భిన్నత్వంలో ఏకత్వం చేసి పాలించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల, బూత్‌లెవెల్ కమిటీలు ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసే నాయకులు ముందుకొస్తే పదవులు ఇస్తామన్నారు.

'ఇకపై బహిరంగ రాజకీయాలే'

సోమందేపల్లి, అక్టోబరు 11 : ఇకపై బహిరంగ రాజకీయాలు చేస్తామని వైసీపీ నూతన పట్టణాధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంజు తెలిపారు. శుక్రవారం వైఎస్ఆర్ కూడలిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తమపై నమ్మకం ఉంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకుపోయి బహిరంగ రాజకీయాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు రమాకాంతరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వాహనాలు నిలిపితే కేసులు



హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

పెనుకొండ రూరల్, అక్టోబరు 11 : కియా ఇండస్ట్రియల్ పరిధిలోని జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం కియా ఇండస్ట్రియల్ పరిధిలోని గుట్టూరు నుంచి హరిపురం వరకు ఏర్పాటు చేసిన హోటళ్లు, రెస్టారెంట్లు, భవన యజమానులను పిలిపించి సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారిపై వాహనాలు ఆపి ఉంచిన వారిపై, హోటల్ యాజమానుపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు

సోమందేపల్లి, అక్టోబరు 11 : వర్షానికి మండలంలోని చెన్నాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం సమాచారం అందుకున్న సర్పంచ్ నరసింహులు అక్కడికి చేరుకుని కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి మరమ్మతులు చేయించారు. మంత్రి సవితతో మాట్లాడి త్వరలో గ్రామానికి సీసీ రోడ్డు వేయిస్తామని సర్పంచ్ తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ప్రగతి దారిలో పల్లె ప్రయాణం

- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం - డిసెంబరుకు పూర్తిచేయాలన్నదే లక్ష్యం - 14 నుంచి 20వరకు పల్లెపండగ

హిందూపురం, అక్టోబరు 11 : వైసీపీ నిర్వాకంతో గత ఐదేళ్ల పాలనలో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. పంచాయతీ నిధులను దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. గ్రామీణ ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. వాటిని ప్రగతిబాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. పల్లె పండగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో రూ.53 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిద్వారా డ్రైనేజీలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈనెల 20వరకు పల్లెల్లో పండగలా నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఎంపిక చేసిన పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారు. హిందూపురం రూ. 30 కోట్లు, పెనుకొండకు రూ.23కోట్లు కేటాయించారు. హిందూపురం నియోజకవర్గంలో 197 పనులు చేపట్టనున్నారు. హిందూపురం రూరల్ 83, లేపాక్షి 54, చిలమత్తూరు 59 పనులు గుర్తించి ప్రారంభిస్తారు. ఇందులో 30 కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు, 10 కి.మీ. బీటీ రోడ్డు, 3 కి.మీ. డ్రైనేజీలు ఏర్పాటు చేస్తారు. 60 చోట్ల కల్వర్లు నిర్మించనున్నారు. లింకు రోడ్లకు మట్టితో చదునుచేయనున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 305 పనులు చేపట్టనున్నారు. ఇందులో 41 కిలో మీటర్లు సీసీ, బీటీ రోడ్లు వేయనున్నారు. ఈ నియోజకవర్గంలో కూడా డ్రైనేజీలు, కల్వర్టులు కొన్నిచోట్ల పాఠశాలలో ప్రహరీలు నిర్మించనున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు తెలిపిన సమస్యలు ఆధారంగా పనులు ఎంపిక చేశారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి తీవ్ర సమస్య ఉన్నచోట ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రోడ్లన్నింటినీ డిసెంబరులో పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది.



సీసీ రోడ్డుగా మారనున్న మట్టి రోడ్డు

పెనుకొండలో పండగ సందడి



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న శ్రీకృష్ణదేవరాయల సర్కిల్

పెనుకొండ, అక్టోబరు 11 : దసరా పండగ సందర్భంగా శుక్రవారం కొనుగోలు దారులతో పట్టణంలో సందడి నెలకొంది. ఆయుధాలపూజ సందర్భంగా పూజకు అవసరమైన పూలు, పండ్లు, అరటి పిలకలు, మామిడాకులు, టెంకాయలు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెనుకొండకు రావడంతో కృష్ణదేవరాయల సర్కిల్, తెలుగుతల్లి, గాంధీ సర్కిల్, కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండుగను ఆసరాగా చేసుకుని పూలు, పండ్ల ధరలను విపరీతంగా పెంచేశారు. కనకాంబరాలు, కాగడాలు, జాజిపూలు మూర రూ.100పలకగా గులాబీలు కిలో రూ.600 నుంచి రూ.800, చామంతి రూ.400 వరకు పలికాయి.

ఘనంగా దుర్గాష్టమి



దుర్గాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, అక్టోబరు 11: మండల వ్యాప్తంగా దుర్గాష్టమి వేడుకలు, ఆయుధ పూజ కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని దేవాంగులు చిత్రావతి నది నుంచి చౌడేశ్వరి అమ్మవారి కళశాన్ని ఎత్తుకుని ప్రధాన రహదారిపై వీవర్సుకాలనీ వరకు మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చౌడేశ్వరి కాలనీలో అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గాంధీ సర్కిల్లోని చౌడేశ్వరి ఆలయంలో అర్చకులు నాగభూషణ అమ్మవారిని మహిషాశురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు.

మట్టి తరలింపుతో చింతచెట్లకు చేటు

తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

గోరంట్ల, అక్టోబరు 11: రహదారులకు మట్టి తోలే క్రమంలో చింతచెట్లకు చేటు తెస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. మండలంలోని మేరెడ్డిపల్లి రహదారిలోని అంజనేయస్వామి ఆలయం వద్ద గల చింతతోపులోని మట్టిని రోడ్డు పనికి తరలించడంతో చింతచెట్లకు విఘాతం కలిగింది. రూ.1.14 కోట్లతో ఉపాధి పథకం ద్వారా ఎరయ్యగారిపల్లి నుంచి మేరెడ్డిపల్లి వరకు తారు రోడ్డు పనులు జరుగుతున్నాయి. కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ రోడ్డు పని కోసం సుదూరం నుంచి మట్టి తరలించడానికి ఖర్చు అధికంగా వస్తుందని, సమీప ప్రాంతాల్లోని మట్టిని వినియోగిస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం పక్కన శతాబ్దకాలంనాటి చింతచెట్లు తోపు పొరంబోకు భూమిలోని మట్టిని తరలిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌తో మట్టిని లోతుగా తవ్వడంతో చింతచెట్ల వేర్లు, పై కొమ్మలు అడ్డురావడంతో తొలగించారు. తద్వారా యేళ్లనాటి చింతచెట్లకు ప్రమాదం సంభవిస్తుందని గుర్తించిన ఎరయ్యగారిపల్లికి చెందిన పచ్చా అశోక్‌కుమార్, శ్రీరాములు, చంద్రారెడ్డి మట్టి తరలింపును అడ్డుకున్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.




చింత తోపులో మట్టి తరలించిన ప్రాంతం, తొలగించిన చింతచెట్ల వేర్లు

చెరువులను తలపించిన రోడ్లు

- పొంగిపొర్లిన మురుగునీటి కాలువలు
- పాదచారులు, వాహనదారుల అవస్థలు

హిందూపురం అర్బన్, అక్టోబరు 11: పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెరువులను తలపించేలా రోడ్లపై నీరు చేరింది. మోకాలిలోతులో నీరు చేరడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవాంరం రాత్రి 7.30 గంటల నుంచి 9 గంటల దాకా భారీగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలో ప్రధాన రహదారి అయిన రైల్వేరోడ్డులో పల్లా రెసిడెన్సీ ముందు భాగం నుంచి బాలాజీ సర్కిల్ వరకు ఇటు వైపు రోడ్డులో నీరు రోడ్లపైకి చేరింది. దీంతో వాహనదారులు గుంతల రోడ్డులో ప్రయాణిస్తే పడతామనే భయంతో పాండురంగనగర్ మీదుగా వెళ్లాలని ప్రయత్నించగా.. అక్కడ కూడా మోకాలి లోతులో వర్షపునీరు నిలిచిపోయింది. డ్రైన్లు పూడిక తీయకపోవడంతో కాలువలు నిండి వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మురుగునీరు ఇళ్లలోకి, రోడ్లపైకి వచ్చింది. వర్షం వచ్చిన ప్రతిసారి ఈ కష్టాలు తప్పడంలేదని వాహనదారులు మండిపడ్డారు. వీడీ రోడ్డులో భవన నిర్మాణానికి ఇసుక, మట్టి వేయడంతో అది కాస్త కాలువలో పడి కాలువలో నీరు ముందుకు కదలలేక రోడ్డుపైకి చేరింది.





హిందూపురం పట్టణం పల్లా రెసిడెన్సీ వద్ద చెరువును తలపిస్తూ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, పాండురంగనగర్‌లో ఇలా.. నిండిపోయి పొర్లుతున్న మురుగు కాలువలు